

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY


సంపుటి : 12 సంచిక : 145 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 20 ఆగస్టు 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




1959 - 2024

దివంగత షఫీఉల్లా ఖాన్

మాజీ మేనేజింగ్ ఎడిటర్



● ఇరు దేశాల మధ్య సంబంధాలపై చర్చ

● సానుకూల సమావేశంగా ప్రధాని మోడీ వెల్లడి

# ప్రధానితో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భేటీ

న్యూఢిల్లీ,ఆగస్టు19(సమయజ్యోతి):

భారత్-చైనా సంబంధాలలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది.భారత్, చైనా మధ్య సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గత ఏడాది రష్యాలోని కజాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తన భేటీ- అనంతరం పరిస్థితుల్లో సానుకూల మార్పు వచ్చిందన్నారు. భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ మంగళవారం ప్రధాని మోదీతో భేటీ- అయ్యారు. అనంతరం ప్రధాని ఈ మేరకు ట్వీట్ చేశారు.వాంగ్ యీని కలవడం ఆనందంగా ఉంది. గతేడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమైనప్పటినుంచి.. ఇరుదేశాల సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయి. పరస్పర ప్రయోజనాలు, సున్నిత అంశాలను గౌరవించడం ద్వారా ఇది సాధ్యమైంది. చైనాలోని తియాంజిన్‌లో నిర్వహించనున్న 'షాంఘై సహకార సంస్థ' శిఖరాగ్ర సదస్సు సమయంలో జిన్‌పింగ్‌తో సమావేశం కోసం ఎదురు చూస్తున్నాను.

మిగతా 2 లో

కేసీఆర్ ఇచ్చిన జీవోనే బీసీలకు

# 42 శాతం రిజర్వేషన్లకు అడ్డంకి

## సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ఆగస్టు 19సమయజ్యోతి

తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేకపోతున్నామని రేవంత్ రెడ్డి అంటున్నారు. కేసీఆర్ చేసిన పంచాయితీ రాజ్ చట్టంలో రిజర్వేషన్లు అన్నీ 50శాతం లోపే ఉండాలని ఉందన్నారు. ఆ చట్టమే ఇప్పుడు బీసీలకు 42% రిజర్వేషన్లు అందకుండా అడ్డంకిగా మారిందని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ శంకుస్థాపన సభలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ల అంశంలో కేసీఆర్ చేసిన తప్పిదం వల్లే సమస్యలు వచ్చాయని తేల్చారు.రేవంత్ రెడ్డి ఈ మాట చెప్పడం ఇదే మొదటి సారి కాదు. అసెంబ్లీలోనూ చెప్పారు. ఢిల్లీ ధర్నాలోనూ చెప్పారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించినప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం రిజర్వేషన్లను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50 శాతానికి పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. అంతకు ముందే ఉమ్మడి రాష్ట్రంలో సుప్రీంకోర్టు ప్రత్యేక అనుమతితో బీసీలకు ఎక్కువ రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు.. యాభై శాతం లోపే రిజర్వేషన్లను ఖరారు చేయాలని ఆదేశించింది. దాంతో కేసీఆర్‌కూ తప్పలేదు.అయినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీ తరపున కామారెడ్డి డిక్లరేషన్ రిలీజ్ చేశారు. ఇప్పుడు కేంద్రం అంగీకరించకపోవడంతో .. అమలు చేయలేకపోతున్నారు. సెప్టెంబర్ నెలాఖరుకు.. స్థానిక ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ రిజర్వేషన్ల అంశంపై ఏం చేద్దామన్నదానిపై రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకోలేకపోయింది.

## 91త్రైపాక్షిక మీటింగ్‌కు కూడా


# తాము సిద్ధం

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

వాషింగ్టన్ ఆగస్టు 19సమయజ్యోతి



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయిన తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీమీడియాతో మాట్లాడారు. రష్యాతో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పుతిన్‌తో జరిగే చర్చల అంశంలో తుది తేదీలు ఏమీ ఖరారు కాలేదని ఆయన అన్నారు. ట్రంప్‌తో భేటీ తర్వాత.. రష్యా, ఉక్రెయిన్ మధ్య చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. త్రైపాక్షిక మీటింగ్‌కు కూడా తాము సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వెల్లడించాడు. ఒకవేళ ద్వైపాక్షక చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్‌తో చెబితే, దానికి కూడా తాము సిద్ధంగా ఉన్నట్లు జెలెన్‌స్కీ తెలిపాడు. శాంతి స్థాపన కోసం ఉక్రెయిన్ ఎప్పటికీ వెనుకడుగు వేయదని ఆయన అన్నారు.జెలెన్‌స్కీతో జరిగిన భేటీ గురించి వైట్‌హౌజ్ నుంచి పుతిన్‌తో మాట్లాడినట్లు ట్రంప్ చెప్పారు. మీటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపానన్నారు. అయితే పుతిన్, జెలెన్‌స్కీ కలిసే వేదికను ఇంకా ఖరారు చేయలేదన్నారు. ఆ సమావేశం తర్వాత త్రైపాక్షిక సమావేశం జరిగే అవకాశాలు ఉన్నాయని, ఆ మీటింగ్‌లో పుతిన్, జెలెన్‌స్కీతో పాటు తాను కూడా పాల్గొననున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఉక్రెయిన్ అంశంలో సెక్యూర్టీ గ్యారెంటీలను కూడా డిస్కస్ చేసినట్లు తెలిపారు.




# విరామం ఎరుగని మంత్రి సీతక్క

ఎక్కడ ఉన్నా ములుగు ఆలోచనే

ములుగు

ములుగు జిల్లాలో వరద పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి సీతక్క.ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల ప్రభావం నేపథ్యంలో పరిస్థితిని సమీక్షిస్తూ మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.చెరువులు, కుంటల నీటి మట్టం, వాగులు, వంకల పరిస్థితులపై అధికారులు మంత్రికి నివేదిక సమర్పించారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరద ప్రాంతాల్లో మానవ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు.

2లో




# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించండి



: జీఎస్టీ కౌన్సిల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

జీఎస్టీ స్లాబ్ రద్దు అంటూ కేంద్రం ప్రచారం చేసుకుంటోందని విమర్శ

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయన్న కేటీఆర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్న కేటీఆర్

ధరల తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో కేంద్రానికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.

మిగతా 2 లో

## హైదరబాద్ బ్రాండ్‌కు తగ్గట్లుగా

# గణేశ ఉత్సవాలు

- ఉత్సవాలు..ఊరేగింపులకు..నిమజ్జనాలకు భారీగా ఏర్పాట్లు
- ప్రజలు, ఉత్సవ సమితి సంఘాలు పూర్తిగా సహకరించాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం విజ్ఞప్తి

హైదరాబాద్,ఆగస్టు19(సమయజ్యోతి):

హైదరాబాద్ సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో రానున్న గణేష్ ఉత్సవాలను తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా వైభవోపేతంగా నిర్వహిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల గణేష్ ఉత్సవాలు-2025 ఏర్పాట్ల పై ఎంసిఆర్ హెచ్ఆర్ డి లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, డీజీపి డా జితేందర్ , ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, భాగ్యనగర్, బాలాపూర్, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

మిగతా 2 లో

మొదటిపేజీ తరువాయి

# ప్రధానితో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భేటీ

భారత్, చైనాల మధ్య స్థిరమైన, నిర్మాణాత్మక సంబంధాలు.. ప్రాంతీయ, ప్రపంచ శాంతికి, అభివృద్ధికి దోహదపడతాయని ప్రధాని మోదీ'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ తదితరులతో వాంగ్ యీ సమావేశమైన విషయం తెలిసిందే. పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనాల ఆధారంగా ఇరుదేశాల సంబంధాలు ముందుకు సాగాలని జైశంకర్ ఆకాంక్షించారు. చైనాలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో జరిగే ఎస్‌సీవో సదస్సుకు ప్రధాని మోదీ హాజరవుతున్నారని అజిత్ డొభాల్ అధికారికంగా ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక నివాసం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యిని సాదరంగా ఆహ్వానించారు. ఇది కేవలం ఒక సాధారణ టీ- సమావేశం మాత్రమే కాదు. అత్యంత కీలకమైన దౌత్య సమావేశమని చెప్పవచ్చు. రెండు దేశాల మధ్య గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ-కి చాలా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానంగా 2020లో లడఖ్ గాల్వాన్ లోయ వద్ద జరిగిన ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. అలాంటి సమయంలో ఇద్దరు ప్రముఖ నేతలు ఒకే టేబుల్ వద్ద కలవడం ఆసక్తికరంగా మారింది.వాంగ్ యి మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇది భారత్-చైనా సంబంధాలలో పురోగతి సాధించే విషయమని చెప్పొచ్చు. ఈ సమావేశం సైనిక, దౌత్యపరమైన చర్చలను ముందుకు తీసుకెళ్లడం పై దృష్టి సారించింది. 2020 నుంచి రెండు వైపులా లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ వెంబడి ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరు దేశాలు కష్టపడుతున్నాయి. మోదీ, వాంగ్ యి ఈ సమ్మిట్ కోసం ఎజెండాను నిర్ణయించనున్నారు. దీంతోపాటు- రెండు దేశాల మధ్య సహకారాన్ని ఎలా బలోపేతం చేయడం, ఇటీ-వలి ద్వైపాక్షిక సంబంధాల గురించి కూడా చర్చించే అవకాశం ఉంది. ఉద్రిక్తతలను తగ్గించడానికి, సంబంధాలను బలోపేతం చేయడానికి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

మొదటిపేజీ తరువాయి

# హైదరబాద్ బ్రాండ్‌కు తగ్గట్లుగా గణేశ్ ఉత్సవాలు

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.... ఈ నెల 27 వ తేదీన ప్రారంభమై సెప్టెంబర్ 6 వ ముగియనున్న గణేష్ ఉత్సవాలు-2025 సజావుగా జరిపేందుకు నిర్వాహకులు,ప్రజలు తమ పూర్తి సహకారం అందించాలనీ ప్రభుత్వం తరపున కోరుతునన్నారు. భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మిక ఉట్టిపడేలా ధార్మిక కార్యక్రమాన్ని గతం సంవత్సం కంటే ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన, మార్గదర్శనం మేరకు గణేష్ ఉత్సవాల ప్రతిష్టాపన, నిర్వహణ, నిమజ్జనం సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు- చేస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా , ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టలనీ సంబంధిత అధికారులకు సూచించారు. నిర్వహకులు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి మండపం వద్ద విద్యుత్ ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కరపత్రాలను ముద్రించి ప్రజలకు పంపిణీ చేయాలని విద్యుత్ అధికారులకు మంత్రి సూచించారు. ఇప్పటికే రోడ్డు సేఫ్టీ కార్యక్రమం ద్వారా నగరంలో రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు- తెలిపారు. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లు దెబ్బతింటు-న్నాయని చెప్పారు. అదనపు నిధులతో దెబ్బతిన్న రోడ్లకు నార్మల్ కండిషన్ కు తెస్తున్నట్లు- తెలిపారు. ఎండోమెంట్, సాంస్కృతిక శాఖలు ఉత్సవ ప్రాధాన్యాన్ని సమాజానికి ఉపయోగపడేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. గణేష్ ఉత్సవాలలో శాఖలు తమకు ఇచ్చిన భక్తి భావంతో బాధ్యతను నిక్కచ్చిగా నిర్వర్తించాలనీ ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది అందరి పండుగ. హైదరాబాద్ లో జరిగే బిగ్గెస్ట్ ఫెస్టివల్. అన్ని ప్రభుత్వ శాఖలు, ఉత్సవ సమితి ,ప్రజలు పరస్పర సహకారంతో సక్సెస్ చేద్దామని మంత్రి అన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మీ మాట్లాడుతూ.... గణేష్ ఉత్సవాల నిర్వహణలో జీహెచ్ఎంసీది అతిపెద్ద బాధ్యత అని అన్నారు. వేడుకల్లో జీహెచ్ఎంసీ చేస్తున్న ఏర్పాట్ల పై కమిషనర్ సమావేశంలో సవివరమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. లోటుపాట్లు సమీక్షించుకుంటూ గత సంవత్సరం కంటే వైభవంగా వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే ఉత్సవ సమితి సభ్యులు లిఖిత పూర్వకంగా తనకు గాని, కమిషనర్ కు గానీ తెలిజేస్తే ...వాటిని పరిష్కరిస్తామని అన్నారు. వర్షాలు కురుస్తున్నందున నిర్వాహకులు, ప్రజలు, యంత్రాగం అప్రమత్తంగా ఉంటూ ఉత్సవాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా సేఫ్ గా జరుపుకుందామని అన్నారు. డీజీపి డా జితేందర్ మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం, సహకారంతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు- చేస్తుందన్నారు. గత సంవత్సరం కంటే అదనంగా సిబ్బందిని డ్యూటీ కి ఉపయోగిస్తామని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఎలాంటి గ్యాప్ లేకుండా సమన్వయం చేసుకుంటే వేడుకలు బాగా జరుగుతాయన్నారు. వర్షం పడుతున్నందున ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపి సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగే గణేష్ ఉత్సవాలలో జీహెచ్ఎంసీ కీలక పాత్ర పోషిస్తుందనీ చెప్పారు. జీహెచ్ఎంసీ అన్ని విభాగాలు, ఇతర శాఖలతో సమన్వయంతో పౌరుల సౌకర్యం, భద్రత దృష్ట్యా నిరంతరం కృషి చేస్తున్నాయని ఆయన చెప్పారు. ఊరేగింపు జరిగే ప్రధాన మార్గాలు , జాతీయ రహదారుల్లో గుంతలు పూడ్చడం ,రోడ్డు మరమ్మత్తు పనులు చేస్తున్నట్లు- తెలిపారు. మౌలిక సదుపాయాలతో పాటు- శుభ్రతా చర్యలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు-, వైద్య శిబిరాలు, కృత్రిమ పాండ్ ల నిర్మాణం వంటి ఏర్పాట్లు- చేస్తున్నట్లు- కమిషనర్ తెలిపారు. ఇంజనీరింగ్ బృందాలు హుస్సేన్‌సాగర్‌తో పాటు- ప్రధాన చెరువులు, నిమజ్జన స్థలాల్లో క్రేన్లు, పరికరాలను సిద్ధం చేస్తున్నాయన్నారు. నగర ప్రజలకు 2 లక్షల ఎకో ఫ్రెండ్లీ గణేష్ ల ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వేడుకల్లో బడ్జెట్, మౌలిక సదుపాయాల సహకారం అందిస్తున్నామని కమిషనర్ మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గణేష్ మండపాలకు గత సంవత్సరం లాగే ఉచిత విద్యుత్ అందిస్తామని విద్యుత్ సంస్థ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూస్తామన్నారు.

## 40 అంతస్థుల భారీ రాకెట్ నిర్మాణం

### ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్టు19(సమయజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో కీలక ముందడుగు వేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఏకంగా 40 అంతస్తుల భవనమంత భారీ రాకెట్ నిర్మించే పనిలో నిమగ్నమైనట్లు- ఆ సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం లో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది నావిక్ ఉపగ్రహం, ఎన్1 రాకెట్ ప్రయోగం, అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యునికేషన్ శాటిలైట్‌ను కక్ష్యలోకి చేర్చడం వంటి ప్రాజెక్టులు చేపట్టనుందన్నారు. అబ్దుల్ కలామ్ జీ తయారు చేసిన తొలిరాకెట్ 17 టన్నుల లిఫ్టఆఫ్ బరువుతో.. 35 కిలోల ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్యకు చేర్చింది. కానీ, నేడు 75,000 కిలోల బరువైన పేలోడ్‌ను దిగువ భూకక్షయకు చేర్చడంపై పనిచేస్తున్నాం. అందుకు అవసరమైన రాకెట్ 40 అంతస్తుల భవనం అంత ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు కక్ష్యలో 55 ఉపగ్రహాలు ఉన్నాయని చెప్పారు. వచ్చే మూడు లేదా నాలుగేళ్లలో వీటి సంఖ్య మూడు లేదా నాలుగు రెట్లు- పెరగనుందన్నారు. ఇస్రో ప్రస్తుతం టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ శాటిలైట్ (టీడీఎస్), నౌకాదళం కోసం సిద్ధం చేసిన జీశాట్-7ఆర్ ప్రయోగించనుంది.

మొదటిపేజీ తరువాయి

# విరామం ఎరుగని మంత్రి సీతక్క

చేవెళ్ల ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, హైదరాబాద్ తిరుగు ప్రయాణం మధ్యలోనే మంత్రివర్యులు ఈ సమీక్ష జరపడం విశేషం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని గుర్తు చేస్తూ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ సిద్ధంగా ఉంచాలని, వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగినంత ఆహారం, తాగునీరు, వైద్య సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క సూచించారు.ప్రతి వాగుపై పట్టు ప్రజా రక్షణలో మంత్రి సీతక్క ముందంజ. భౌగోళిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన నాయకులే ప్రజాసేవలో గొప్పగా రాణిస్తారని ఎన్నోసార్లు రుజువైంది. ఇప్పుడు ఆ జాబితాలో మంత్రి సీతక్క కూడా నిలిచారు. తన నియోజకవర్గంలోని ప్రతి చెరువు, వాగు, తోగు, కుంటపై సంపూర్ణ అవగాహనతో, వాటి పేర్లను వేళ్లమీద లెక్కపెట్టినట్టుగా పలుకుతూ, వరద పరిస్థితులపై అధికారులు ఇచ్చిన నివేదికలను సమీక్షించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.కొండాయి, భూటారం, జంపన్న వాగు, ప్రాజెక్ట్ నగర్ వాగు, గుండ్ల వాగు, కాల్వపల్లి%౯% ఇలా ప్రతి వాగుపై ప్రత్యేక పట్టు ఉన్న సీతక్క, అక్కడి పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. జంపన్న వాగు సహా ములుగు జిల్లాలోని అన్ని వాగుల పరిస్థితిపై నిశితంగా దృష్టి పెట్టి, ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వరద ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను తక్షణం సురక్షిత ప్రదేశాలకు తరలించాల్సిందిగా కలెక్టర్‌తోపాటు సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. వచ్చే రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.రాత్రివేళల్లో సైతం అధికారులు విధుల్లో ఉండేలా పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలు వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి వాగు నీటి స్థితిని గంట గంటకూ అంచనా వేసి, అవసరమైతే వెంటనే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క హితవు పలికారు.ప్రజల ప్రాణాలకు మించినది ఏదీ లేదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చు, అని మంత్రి సీతక్క స్పష్టం చేయడం ద్వారా ప్రజా రక్షణపై తన అపారమైన కట్టుబాటును మరోసారి చాటిచెప్పారు.

మొదటిపేజీ తరువాయి

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించండి

జీఎస్టీ స్లాబ్ రద్దు అంటూ కేంద్రం ప్రచారం చేసుకుంటోందని, కానీ ధరల తగ్గింపుపై చిత్తశుద్ధి లేదని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ విధించిందని, ఆ తర్వాత ఆ పన్నును 12 శాతానికి పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ విధింపును వ్యతిరేకిస్తూ తాము కేంద్ర ప్రభుత్వానికి అప్పుడే లేఖ రాశామని గుర్తు చేశారు. వ్యవసాయం తర్వాత లక్షలాది కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడ్డాయని అన్నారు.చేనేత అనేది కేవలం వస్త్ర తయారీ రంగం మాత్రమే కాదని, అది మన సాంస్కృతిక వారసత్వమని ఆయన అన్నారు. చేనేతపై పన్ను వేయడమంటే మన సంస్కృతిని అవమానించడమేనని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు.

# మోడీని కలిసిన శుభాంశు శుక్లా

న్యూఢిల్లీ, ఆగస్టు 19, (సమయజ్యోతి)

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంకు వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ భేటీలో శుక్లా దేశానికి గర్వకారణమైన ఒక బహుమతిని ప్రధాని మోదీకి అందజేశారు. అంతరిక్షంలో తనతో పాటు ప్రయాణించి వచ్చిన భారత త్రివర్ణ పతాకాన్ని ఫ్రేమ్ చేయించి మరీ ప్రధానికి బహూకరించారు. దీంతో పాటే మరో బహుమతి కూడా ఆయనకు బహూకరించారు. ప్రధాని మోదీ శుక్లాను సాదరంగా ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు.అంతరిక్షంలో భారత దేశాన్ని ప్రతిబింబించినందుకు ప్రధాని మోదీ శుభాంశు శుక్లాను అభినందించారు. %ఐూ%కు వెళ్లి వచ్చిన క్రమంలో ఎదురైన అనుభవాలను, సవాళ్లను ప్రధాని మోదీకి శుక్లా వివరించారు. అంతరిక్షంలో శుక్లా అనుభవాలు, అంతరిక్ష విజ్ఞానంలో తాజా పురోగమనాలు, భారత్ ప్రతిష్టాత్మక 'గగన్‌యాన్' మిషన్ భవిష్యత్తు గురించి చర్చించారు. అంతేకాకుండా త్రివర్ణ పతాకంతో పాటు శుక్లా తన మిషన్‌కు సంబంధించిన ప్రత్యేక మిషన్ ప్యాచ్‌ను కూడా ప్రధానికి బహూకరించారు.

# రోడ్కెక్కుతున్న రైతులు యూరియ కొరత పాపం ఎవరిది

హైదరాబాద్, ఆగస్టు 19, (సమయజ్యోతి)

లంగాణ రాష్ట్రం ప్రస్తుతం యూరియా సంక్షోభం లో చిక్కుకుంది. విస్తారం వర్షాలు పడుతున్న ఈ సమయంలో రైతులు యూరియా కోసం చెప్పులరిగేలా తిరుగుతు న్నారని, వ్యాపారస్తులు సైతం కృత్రిమ కొరత సృష్టించే అవకాశాలు న్నందున రైతులు ఆందోళన చెందు తున్నారు. రాష్ట్రానికి కేటాయించాల్సిన వాటా కేటాయించే విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాల్ని ఎండగడుతూ, ఒకవైపు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు డిల్లీలో కేంద్రంపై ఒత్తిడి తీసుకోవచ్చే పనిలో ఉండగా, రాష్ట్రంలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వద్ద సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ప్రెస్ మీట్ పెట్టీ రాష్ట్రం నుంచి ప్రతినిధి వహిస్తున్న కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డితో పాటు బీజేపీ ఎంపీలపై విరుచుకుపడుతున్నారు. రాష్ట్రానికి తీసుకురావాల్సిన యూరియా కేటాయిం పులను తీసుకు రావడంలో విఫలమయ్యారని, రైతుల బాధలు పట్టించుకోవడం లేదని విమర్శలకు దిగు తున్నారు. మరోవైపు ప్రస్తుత పరిస్థితిని అంచనా వేస్తూ యూరియా నిల్వలను ఏవిధంగా ఉపయోగించుకోవాలని విష యాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే.రామ కృష్ణరావుతో కలిసి కలెక్టర్లతో హుటాహుటిన వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడంతో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.జూలై, ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురువడం వల్ల రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వంటి వివిధ కారణాలని ప్రభుత్వం చెబుతోంది.చైనా, జర్మనీ, ఇరాన్, యుమాన్ వంటి పలు దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదు. ఏప్రిల్ నెల నుంచి కేటాంయింపుల మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా కాలేదని, మొత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ సరఫరా జరిగిందని మంత్రి తెలిపారు. మన దగ్గర గతంలో ఉన్న 2 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ తో రైతులకు ఇప్పటి వరకు కొంత మేర సరఫరా చేసామని తెలిపారు.మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించాలన్నారు. ప్రస్తుతం ప్రైవేటు డీలర్ల వద్ద 35 వేల మెట్రిక్ టన్నులయూరియా స్టాక్ అందుబాటులో ఉందని, అది సక్రమంగా విక్రయం జరగా లన్నారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని, రైతులు అధికంగా స్టాక్ పెట్టుకోవద్దని, అవసరం మేరకే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించా లన్నారు జియో పొలిటికల్ కారణాల వల్ల దేశానికి యూరియా సరఫరా సరఫరా దెబ్బతిందని, రామ గుండం ఆర్.ఎఫ్.సి.ఎల్ ప్లాంట్ లో సాంకేతిక కారణాలవల్ల ఉత్పత్తి పలుమార్లు నిలిచిపోవడం కూడా ఒక కారణమని చెబుతున్నారు.కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు వచ్చే ఎరువుల సరఫరాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల కోత ఉన్నప్పటికీ, గత సంవత్సరంతో పోలిస్తే నేటికి లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అదనంగా రైతులకు సరఫరా చేశామని ప్రభుత్వం చెబుతున్నది.రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వం తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ వీలైనంత అధికంగా యూరియా తీసుకొని వచ్చేందుకు కృషి చేస్తున్నారు. వ్యవసాయం కోసం కేటాయించిన యూరియాను పారిశ్రామిక అవసరాల కోసం అక్రమంగా తరలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి సమాచారం ఉంది. వీటిని కట్టడి చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలకు పూనుకుంది. యూరియా, ఇతర ఎరువుల లభ్యత వివరాలను కలెక్టర్లు ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్ ఫెడ్, ప్రైవేట్ కంపెనీల వద్ద మండల స్థాయి వరకు స్టాక్ ఎంత ఉందో రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని, మండలాల వారీగా సాగుకు అను గుణంగా ఎరువుల స్టాక్ సమర్థ వంతంగా , శాస్త్రీయంగా కేటా యింపు చేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లాలకు ఎరువుల రేక్ స్టాక్ ఎంత వరకు రాబోతున్నాయి వంటి అంశాలను కలెక్టర్ కు ముందస్తుగా తెలియ జేస్తామని కూడా తెలిపారుప్రైవేట్ ఎరువుల డీలర్ల షాపులను ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. యూరియా అవసరం ఉన్న పరిశ్రమలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, వ్యవసాయ సంబంధిత ఎరువులను పరిశ్రమల కోసం వినియోగిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జూన్, జూలై నెలల్లో అధికంగా యూరియా కొనుగోలు చేసిన బయ్యర్స్, రెగ్యులర్ గా కొనుగోలు చేసే బయ్యర్స్ వివరాలను ట్రాక్ చేయాలని, వీరు ఎక్కడైనా యూరియా డైవర్ట్ చేస్తున్నారా అని కూడా పరిశీలించాలన్నారు. జిల్లాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా డ్రోన్ ద్వారా నానో యూరియా, డిఏపి కాంప్లెక్స్ ప్రోత్సహించాలని కూడా తెలిపారు. ఆదిలాబాద్, సూర్యాపేట, నిజామాబాద్, నారాయణ పేట వంటి సరిహద్దు జిల్లాలో ఇతర రాష్ట్రాల రైతులకు యూరియా అమ్మకుండా చూడాలని, మన స్టాక్ బ్లాక్ మార్కెట్ కాకుండా బోర్డర్ చెక్ పోస్ట్ ఏర్పాటు

# భారీగా తగ్గనున్న మెడికల్ కేర్ ప్రొడక్ట్స్

ముంబై, ఆగస్టు 19, (సమయజ్యోతి)

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతీయ పతాకం ఆవిష్కరించిన ప్రధాని నరేంద్రమోదీ.. భారత ప్రజలకు ఒక హామీ ఇచ్చారు. దీపావళికి డబుల్ ధామాకా ఇస్తామని ప్రకటించారు. జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) విధానంలో కీలక సంస్కరణలను ఈ దీపావళి నాటికి అమలు చేస్తామని తెలిపారు. ఈ సంస్కరణలు సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు, మధ్య మరియు చిన్న తరహా పరిశ్రమలకు (ఎంఎస్ ఎంఈలకు) ఊరట కలిగించ నున్నాయి. ఈ మార్పుల ద్వారా రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గను న్నాయని, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే విధంగా జీఎస్టీ వ్యవస్థ సరళీకరణ జరుగుతుందని మోదీ సూచించారు. ప్రధానమంత్రి మోదీ ప్రకటన ప్రకారం, జీఎస్టీ విధానంలో "తదుపరి తరం సంస్కరణలు" (జీఎస్టీ 2.0) ఈ దీపావళి నాటికి అమలులోకి వస్తాయి. ప్రస్తుత జీఎస్టీ నిర్మాణంలో ఐదు పన్ను స్లాబ్‌లు (0%, 5%, 12%, 18%, 28%), విలాసవంతమైన, హానికర వస్తువులపై అదనపు సెస్ ఉన్నాయి. సంస్కరణలతో స్లాబ్‌లు సరళీకరించనున్నారు. దీంతో ప్రస్తుత 12% స్లాబ్‌ను రద్దు చేసి, ఈ స్లాబ్‌లోని వస్తువులను 5% లేదా 18% స్లాబ్‌లకు బదిలీ చేయాలనే ప్రతిపాదన ఉంది. దీనివల్ల జీఎస్టీ నిర్మాణం సరళమవుతుంది. రోజువారీ వినియోగ వస్తువులు, గృహోపకరణాలు, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లను తగ్గనున్నాయి. 28% స్లాబ్‌లోని వస్తువులలో 90% వస్తువులు 18% స్లాబ్‌కు, 12% స్లాబ్‌లోని 99% వస్తువులు 5% స్లాబ్‌కు మారే అవకాశం ఉంది. విలాసవంతమైన మరియు హానికర వస్తువులపై విధించే కంపెన్సేషన్ సెస్‌ను 40% ఏకరీతి రేటుగా మార్చాలని ప్రతిపాదన. ఇది ప్రస్తుత సెస్ రేట్లను (1% నుంచి 290% వరకు) సరళీకరిస్తుంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సమస్యలను పరిష్కరించడానికి ఇన్‌వర్టెడ్ డ్యూటీ నిర్మాణాన్ని సరిచేయడం, రిఫండ్ ప్రక్రియలను సరళీకరించడం లక్ష్యంగా ఉంది.ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన వస్తువుల జాబితాను పేర్కొనకపోయినప్పటికీ, నిపుణుల అంచనాల ప్రకారం.. కొన్ని రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఇతర గృహ వినియోగ ఉత్పత్తులపై 28% నుంచి 18%కి జీఎస్టీ తగ్గవచ్చు. ఫ్రూట్ జ్యూస్‌లు, బటర్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, డ్రై ఫ్రూట్స్, సాసేజ్‌ల వంటి ఉత్పత్తులు 12% లేదా 28% నుంచి 5% లేదా 18% స్లాబ్‌కు మారవచ్చు. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, గాజ్, బ్యాండేజ్‌లు, డయాగ్నస్టిక్ కిట్‌ల వంటి ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గే అవకాశం ఉంది. ఆరోగ్య, జీవన బీమా ప్రీమియంలపై ప్రస్తుత 18% జీఎస్టీని 12% లేదా 5%కి తగ్గించాలని చర్చలు జరుగుతున్నాయి, దీనివల్ల బీమా సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి. 10 రూపాయల లోపు ధర ఉన్న ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు (షాంపూ, సబ్బు వంటి చిన్న సాచెట్‌లు) 5% స్లాబ్‌లోకి వచ్చే అవకాశం ఉంది.జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధి, సామాన్య ప్రజల జీవన నాణ్యతపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. ధరల తగ్గింపు వల్ల వినియోగం పెరిగి, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తుంది. లాఫర్ కర్వ్ సిద్ధాంతం ప్రకారం, తగ్గిన పన్ను రేట్లు ఎక్కువ మందిని జీఎస్టీ వ్యవస్థలోకి తీసుకొస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సరళీకృత పన్ను విధానం, తగ్గిన రేట్లు వ్యాపార వ్యయాలను తగ్గిస్తాయి, దీనివల్ల ఈ రంగం బలోపేతమవుతుంది. అయితే పన్ను రేట్ల తగ్గింపు వల్ల ప్రభుత్వ ఆదాయంలో సుమారు 0.15% జీడీపీ నష్టం (500 బిలియన్ రూపాయలు) జరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, దీర్ఘకాలంలో వినియోగం, పన్ను వసూళ్ల పెరుగుదల ఈ నష్టాన్ని భర్తీ చేస్తుందని భావిస్తున్నారు.ఈ సంస్కరణలు దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రెండు స్లాబ్‌ల విధానం ద్వారా వ్యాపారాలకు నియమ నిబంధనలు సరళమవుతాయి, పన్ను వివాదాలు తగ్గుతాయి. రోజువారీ వస్తువుల ధరల తగ్గింపు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. సెస్ రద్దు, రేట్ల సరళీకరణ ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది.

# ప్రతిరోజు డ్రై డే కార్యక్రమం చేపట్టాలి

## : డిఎం అండ్ హెచ్ఓ డా.ఎస్ రజిత

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీ, కెసిఆర్ నగర్ కాలనీలను మంగళవారం డిఎం అండ్ హెచ్ ఓ రజిత, క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. జిల్లాలో అధిక వర్షాలతో గ్రామ, ఇంటి పరిసరాలలో నీరు నిలిచే అవకాశం ఉన్నందున ప్రతిరోజు డ్రై డే కార్యక్రమం చేపట్టాలని, డెంగ్యూ నివారణకై సంబంధిత శాఖల సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. సీజన్ వ్యాధుల నివారణకై జ్వరం వచ్చిన వెంటనే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి చికిత్స అందించాలని అన్నారు. వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్ర పరిధిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డా.అనిత, రాపిడ్ రెస్పాన్స్ టీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# భారీ వర్షాలపై అప్రమత్తం..

## కడెం ప్రాజెక్టు ను పరిశీలించిన మంత్రి జూపల్లి

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 19.



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి ఇన్ఫ్లో, అవుట్‌ఫ్లోపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే 9 కోట్ల రూపాయల నిధులతో మరమ్మతు పనులు పూర్తిచేశామని వెల్లడించారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వరదల కారణంగా పంట పొలాలు, నివాస గృహాలు, రహదారులు నష్టపోయాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం సంబంధిత శాఖలు సర్వే చేసి, నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని, అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. వరద నీటిలో కొట్టుకుపోయిన ఒక మత్స్యకారుని కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి అన్నారు. కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సమాచారం అందించాలని, అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాగులు, నదులు, ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఎమ్మెల్సీ దండేవిట్టల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖాన, ఎరువుల గోడౌన్ ను

# తనిఖీ చేసిన కలెక్టర్

### పాస్ బుక్ లేకున్నా... పంట సాగు చేస్తున్న రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని ఆదేశం

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 19 :

ఎడపల్లి మండలం జైతాపూర్, తానాకలాన్ గ్రామాలలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జైతాపూర్ గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించిన కలెక్టర్, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రూర్బన్ పథకం కింద నూతనంగా నిర్మించిన పల్లె దవాఖాన భవనానికి విద్యుత్ వసతి లేకపోవడాన్ని గమనించి, తక్షణమే విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. రూ. లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన భవనాలకు చిన్నచిన్న సదుపాయాలు కల్పించే విషయంలో తాత్సారం చేయడం వల్ల అసౌకర్యం ఏర్పడుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ నూతన భవనాలకు పూర్తి స్థాయిలో వసతులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ జరపాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ తానాకలాన్ గ్రామంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిలువ ఉన్న ఎరువులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ తరహాలోనే వచ్చే యాసంగి సీజన్ కు సంబంధించి కూడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు పంపిణీ జరిగేలా ఇప్పటినుండే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని నిర్వాహకులకు సూచించారు. ఒకవేళ పట్టా పాస్ పుస్తకాలు లేని రైతులు ఎవరైనా పంటలు సాగు చేస్తుంటే, వారికి కూడా ఎరువులు పంపిణీ చేయాలని ఆదేశించారు. అయితే, వారు పంటలు వేశారా లేదా అన్నది పక్కాగా నిర్ధారించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా యూరియా, ఇతర ఎరువుల కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.





# ప్రారంభోత్సవాలకు ముస్తాబైన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్

## లబ్ధిదారులకు అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశం

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ ఆగస్టు 19 :

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామంలో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి పరిశీలించారు. జైతాపూర్ లో 74 ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభమై, వివిధ దశలలో కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వీటిలో 15 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మాణాలు పూర్తి అయిన ఇండ్లను క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ, ఒక్కో ఇంటి వారీగా పరిశీలన జరిపారు. ఒకటి, రెండు ఇండ్లకు సంబంధించి తుది దశలో అసంపూర్తిగా ఉన్న చిన్న చిన్న పనులను గుర్తించిన కలెక్టర్, యుద్ధప్రాతిపదికన వాటిని పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్ళకు బిల్లుల చెల్లింపులు పూర్తి స్థాయిలో జరిగాయా? అని ఆరా తీశారు. చివరి విడతగా లక్ష రూపాయలు రావాల్సి ఉందని లబ్ధిదారులు తెలుపగా, వెంటనే లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు మంజూరు చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ళకు విద్యుత్ కనెక్షన్, మిషన్ భగీరథ నీటి సరఫరా వంటి సదుపాయాలను సత్వరమే కల్పించాలని ట్రాన్స్కో ఏ.ఈ ముఖ్తార్ ను, ఆర్.డబ్ల్యు.ఎస్ డీ.ఈ రాకేష్ లకు సూచించారు. ప్రారంభోత్సవాల నాటికి, ఏ ఒక్క చిన్న పని కూడా పెండింగ్ లో లేకుండా, అన్ని వసతులు అందుబాటులో ఉండాలన్నారు. ఇళ్ళ ఆవరణలో ఖాళీ స్థలం ఉన్న చోట పూలు, పండ్ల మొక్కలు నాటించాలని అన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు ముందుకు రాని వారి స్థానంలో, అర్హులైన ఇతర లబ్ధిదారులను గుర్తించాలని అధికారులకు సూచించారు. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల విషయంలో అనవసర ఆడంబరాలకు పోయి అప్పుల ఊబిలో కూరుకుపోకూడదని ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు హితవు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలోనే వాటికి ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందని తెలిపారు. జైతాపూర్ లో 15 ఇండ్లు ఇప్పటికే పూర్తయ్యాయని, వారం రోజుల్లో వాటికి ప్రారంభోత్సవాలు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు అందరూ వెంటనే నిర్మాణాలను చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీ.డీ పవన్ కుమార్, నివర్తి, స్థానిక అధికారులు ఉన్నారు.



# పార్డి కె మాజీ ఎం పి టి సి మెస్రం మహాదు బాయి అనారోగ్యం తో మృతి



సమయజ్యోతి న్యూస్ ఆగస్టు 19

సొనాల మండలం లోని పార్డి కే మాజీ ఎం పి టి సి మెస్రం మహాదు బాయి అనారోగ్యం తో మృతి చెందినరు ఆమె మాజీ ఐ టి డి ఎ డైరెక్టర్ మెస్రం భూమన్న తల్లి ఆమె మృతి రాజకీయ నాయకులు నివాళులు అర్పించారు సాయంత్రం అంత్య క్రియలు పూర్తి చేశారు

# పేద రోగులకు బాసటగా బాల బ్రహ్మం ఆదర్శం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్



మారు మూల గ్రామీణ ప్రాంతం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో, దుబ్బాక జిల్లా పరిధిలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దశాబ్దాల తరబడి పారామెడికల్ సిబ్బందిగా, ల్యాబ్ టెక్నీషియన్ గా విశేష సేవలు అందిస్తూ సొప్పదండి బాలబ్రహ్మం, పేద ప్రజల అభిమానాన్ని చురగొన్నారు. కరోనా సమయం లోను వేలాది రక్త పరీక్షలు నిర్వహించి, విధి నిర్వహణలో నిబద్ధత చాటారు. ప్రభుత్వం నుంచి పలుమార్లు ఉత్తమ సేవా ప్రశంస పత్రాలను అందుకోవడం విశేషం. తెలుగు సంస్కృతి సాహితి సేవా సంస్థ పురస్కారాన్ని పొందారు. ప్రభుత్వ పారామెడికల్ రోజువారి విధుల నిర్వహణానంతరం సాయంత్రం వేళ సామాజిక సేవ దృక్పథంతో నామమాత్రపు మూల్యంతో ల్యాబ్ టెక్నీషియన్, ప్రథమ చికిత్స సేవలందిస్తూ ఆదర్శంగా నిలిచారు.

# పిఆర్టియు మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

సెప్టెంబర్ 1న హైదరాబాదులో పిఆర్ టియు ఆధ్వర్యంలో జరిగే సిపిఎస్ మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బాల్కొండ మండల కేంద్రంలో మంగళవారం మండల అధ్యక్షులు వేల్పూర్ శ్రీనివాస్, సంఘ ప్రతినిధులతో కలిసి వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల జీవితాలను "కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్" అంధకారం చేస్తుందని, షేర్ మార్కెట్ ఒడిదుడుకుల మధ్య రిటైర్మెంట్ తర్వాత వారి జీవితం రోడ్డునపడే పరిస్థితి రావచ్చని, సిపిఎస్ ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రతాపరెడ్డి, హెచ్ఎం రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్, సురేష్ కుమార్, సాయన్న, భోజన్న, శంకర్, లక్ష్మీనారాయణ, మండల అసోసియేట్ అధ్యక్షులు పిల్లి గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక


## సంపాదకీయం

# కేంద్రం యూరియా రాజకీయం !

యూరియా కొరత, సరఫరాపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోంది. బిజెపినేతలు కూడా సమస్యను పరిష్కరించేందుకు సాయం చేయకుండా ఎదురుదాడి చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు పొలాలు వదిలి క్యూలో నిలబడి పోరాటం చేస్తున్నారు. చాలాకాలం తరవాత మళ్లీ యూరియా కోసం క్యూలు కడుతున్నారు. ఇది స్థానిక బిజెపి నేతలకు కనిపించక పోవడం దారుణం. సమస్యలను తెలుసుకుని వారధిగా నిలవాల్సిన స్థానిక బిజెపి నేతలు రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీరు ప్రజలకోసం పాలిస్తున్నారా లేక,విపక్ష పార్టీలను వేధించేందుకు పాలిస్తున్నారా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంట్ వేదికగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోక పోవడం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగానే చూడాలి. యూరియా కోసం పార్లమెంట్ ఎదుట రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని కేంద్రం తీరు క్షంతవ్యం కాదు. ఇది రైతులను మోసించడమే తప్ప మరోటి కాదు. వ్యవసాయరంగంపై సరైన అవగాహన లేని పాలకుల తీరుకారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా ఎంత ఇచ్చాం..ఎంత అవసరం అన్నది కూడా తెలియకుండా విమర్శలతో కాలం గడిపితే నష్టపోయేది రైతులే అని తెలుసుకోవాలి. రైతులకు అసవరమైన ఎరువులు,పురుగుమందులు, విత్తనాల కోసం రోడ్డెక్కకుండా చూడడం ప్రథమం. ఇవి కూడా చేయకుండా కల్లబొల్లి కబుర్లతో కాలం గడిపస్తున్నారు. ప్రకృతి సేద్యం, సేంద్రియ సాగు, జీవ ఎరువుల ముసుగులో రాష్ట్రాల ఎరువుల కేటాయింపులకు కోతలు విధించిందని ఆరోపిస్తున్నారు. ఏటేటా ఐదు నుంచి పది శాతం ఎరువుల వినియోగం పెరుగుతున్నది. దీనిని తగ్గించడానికి ముందు కార్యాచరణ అవసరం. రైతుల్లో చైతన్యం తీసుకుని రావాలి. అలాగే రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువులను సిద్ధం చేయాలి. అలాగే సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని పెద్ద ఎత్తున చేపట్టాలి. ఇవేవీ చేయకుండా యూరియా కోటాను ఈ మేరకు కుదించడం సరికాదు. కేంద్రం కేటాయింపులు పెంచాల్సిందిపోయి కుదించడటం సేద్యాన్ని, రైతులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడమే కాగలదు. ఖరీఫ్ రైతుకు అదనకు అవసరమైన యూరియా పుట్టని దుస్థితి దాపురించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణం. మరోవైపు ఎరువులపై రైతులకు ఇచ్చే సబ్సిడీని భారంగా భావించిన కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ వస్తోంది. పర్యావరణం, ప్రజల ఆరోగ్యం కూడా ముఖ్యమే. ఇందుకు ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. కానీ అందుకు తగినకార్యాచర ఒకటి తయారు కావాలి. రైతులకు సేంద్రియ ఎరువులు అందుబాటులోకి తీసుకుని రావాలి. ఇవేవి చేయకుండా అమ్మకాలపై ఆంక్షలు పెట్టడం సరికాదు. గతేడాది పదిశాతం కేటాయింపులు తగ్గించిందని ఎపి రైతులు వాపోతున్నారు. ఆంధ్రా రాష్ట్రంలో నిరుడు 39 లక్షల టన్నుల అమ్మకాలు జరగ్గా 35 లక్షల టన్నులకు ఈ ఏడాది కేటాయింపులు కుదించబడ్డాయి. నాలుగు లక్షల టన్నులు తగ్గిపోయాయి. కేంద్రం ఎరువుల కేటాయింపులను తగ్గిస్తే మారు మాట్లాడకుండా కూటమి నేతలు భారాన్ని రైతులపైకి నెట్టేసారు. కేంద్ర మంత్రులు, ఎన్‌డిఎ ఎంపిలు ప్రధాని మోడీని మాటమాత్రం అడగడం లేదు. వ్యవసాయ రాష్ట్రాలైన తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు, ఇక్కడి రైతాంగానికి మోడీ ప్రభుత్వం అన్యాయం తలపెట్టినా కూటమి నేతలు, బిజెపి నేతలు, కేంద్రమంత్రులు చోద్యంచూస్తున్నారు. 2024 ఖరీఫ్‌లో ఎ.పి. యూరియా వినియోగం 6.32 లక్షల టన్నులు కాగా 2025లో 6.22 లక్షల టన్నులకు కేటాయింపు తగ్గింది. నెలనెలా కేటాయింపులు, వచ్చినది చూస్తే కోత ఇంకా ఎక్కువే. ఉదాహరణకు జులైలో 3.05 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 2.85 లక్షల టన్నులే వచ్చాయి. ఈ కోతలు ఒక వైపు కొనసాగుతుండగా, గతేడాది ఖరీఫ్‌లో ఎప్పటి కంటే నైరుతి రుతుపవనాలు ఈ మారు మే 26న రాష్ట్రంలోకి ప్రవేశించడంతో సీజన్ నెల రోజులు ముందుకొచ్చింది. రాయలసీమ, మరికొన్ని ప్రాంతాల్లో రైతులు ముందస్తుగా పంటలు సాగు చేయడంతో ఒక్కసారిగా యూరియాకు డిమాండ్ వచ్చింది. ధరలు, తెగుళ్లు, నీటి సదుపాయం ఇత్యాది కారణాలతో రైతులు పంటలను మారుస్తున్నారు. యూరియా డిమాండ్‌కు పంటల సరళిలో చోటు- చేసుకున్న మార్పులు కొంత వరకు కారణం. కేంద్రం కోతలను మేనేజ్ చేసే పనిలో వ్యవసాయశాఖ తలమునకలై ఈ పరిస్థితులను అంచనా వేయలేక పోయింది. ఇవన్నీ కలిసి ఖరీఫ్ రైతును ఎరువుల కోసం రోడ్డెక్కేలా చేన్నాయి. ఎరువులు అందుబాటులో ఉన్నాయని కొరత లేదని ప్రభుత్వం ఎంతగా మభ్యపెట్టాలని ప్రయత్నించినా ఆ ప్రచారంలో నిజం లేదనడానికి పెద్ద పెద్ద క్యూలైన్లలో గంటల కొలది పడిగాపులు పడుతున్న అన్నదాత అవస్థలు కళ్లకుకడుతున్నాయి. సగం జిల్లాల్లో యూరియా, డిఎపి లభ్యత అవసరం కంటే తక్కువగా ఉందని ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల్లో పొంతన లేకుండా మాట్లాడుతోంది. మార్క్‌ఫెడ్ వద్ద బఫర్ స్టాక్ అంటున్నా ఎటు తరలుతున్నాయో తెలీదు. ఇదే అదనుగా ప్రైవేటు డీలర్లు బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. వేరే ఎరువుకు లింక్ పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వమే పెద్ద ఎత్తున నానో ఎరువులను అంటగట్టడంతో వాటిని వదిలించు కునేందుకు తంటాలు పడుతున్నారు.

# సాంకేతిక విప్లవానికి ఆధ్యులు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

ఆధునిక భారత నిర్మాత, దేశాన్ని టెక్నాలజీలో పరుగులు పెట్టించిన దూరదృష్టి కలిగిన నాయకుడు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆగస్టు 20 1944 శ్రీమతి ఇందిరాగాంధీ, ఫిరోజ్ దంపతుల పెద్ద కుమారుడు ఢిల్లీలోని డోన్ బాసో పాఠశాలలో చదువుకున్నాడు. లండన్ లోని ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజినీరింగ్ పట్టా పొంది,1968లో సోనియా గాంధీని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు రాహుల్ గాంధీ, పియాంక గాంధీ. రాజీవ్ గాంధీకి మొదటో రాజకీయాలో ఆసక్తి వుండేది కాదు. అతను విమాన పైలెట్ పని చేసే వారు. కానీ 1980లో తన తమ్ముడు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో అకాల మరణం తర్వాత, రాజీవ్ గాంధీ తన తల్లి శ్రీమతి ఇందిరాగాంధీకి మద్దతుగా 1981లో రాజకీయాల్లో ప్రవేశించాడు. 1983లో అతను ఉత్తరప్రదేశ్ అమేథీ లోక్ సభ నియోజకవర్గం నుండి ఎన్నికైన,1984 అకోబరు 31న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఆమె అంగరక్షకుడుచే హత్యకు గురయ్యేరు. అప్పుడు 1984 లో రాజీవ్ గాంధీ భారత ప్రధానిమంత్రి పదవిని చేపట్టినాడు.



**యువ ప్రధానిగా దేశం పై తనదైన ముద్ర.**

టెలికమ్యూనికేషన్స్ లో విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు రాజీవ్ గాంధీ. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి, అ రంగంలో విప్లవ ఆత్మగా మార్పులు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇప్పటికీ ఐఐటి, ఐఐఎం లకు ఐటీ వంటి సంస్థలకు జాతీయ స్థాయిలో ఆయన పేరునే కొనసాగిస్తున్నారు. 18 సంవత్సర నిండిన యువకులకు ఓటు హక్కు కల్పించేలా కృషి చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన రాజీవ్. మహిళలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ 1986 లో రాజీవ్ ప్రభుత్వం కొత్త నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్ ను ప్రవేశ పెట్టింది. రాజీవ్ ప్రభుత్వం 1986లో ఆపరేషన్ బ్లాక్ బోర్డ్ ను, 1987లో పాఠ్ధ వింక స్థాయి విద్యార్థులకు వారి విద్య భవిష్యత్తును సులభతరం చేయడానికి అవసరమైన పరికరాలను, భోధనా సామగ్రిని అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రారంభించింది. శ్రీలంక అంతర్గత వ్యవహారాల్లో రాజీవ్ గాంధీ జోక్యం చేసుకున్నారని భావించిన ఎల్టీటీఈ తీవ్ర వాదులు రాజీవ్ ను దారుణంగా హత్య చేశారు. దేశంలో తమిళ పార్టీలు నుంచి వచ్చిన ఒత్తిడి వల్ల రాజీవ్ శ్రీలంక లోని తమిళులకు సహాయం అందించారు. 1989 లో అధికారంలోకి వచ్చిన రణసింఘే పేమదాసు శ్రీలంక నుంచి భారత బలగాలని ఉపసంహరణ చేసుకోవాలని కోరారు. మన దేశం వెంటనే శ్రీలంక నుంచి వైదొలిగింది. అయినన్నా ప్రతీకారంతో ఉన్న ఎల్టీటీఈ తీవ్రవాదులు 1991 మే 24న శ్రీ పెరంబుదూర్లో రాజీవ్ను హత్య చేశారు. ఆయన వర్ధంతిని "ఉగ్రవాద నిరోధక దివస్" గా. అలాగే ఆయన జయంతిని"సద్భవనదివస్ " గా ఏటా జరుపుకుంటున్నాం.

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా**

**ఆగస్ట్ 20 న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జన్మ దిన సందర్భంగా**

సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

## భారీ వర్షాలు వరదలు నష్టం సహాయక చర్యలపై

# మంత్రి జూపల్లి సమీక్ష

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం ప్రభావిత ప్రాంతాల క్షేత్రపర్యటన సమీక్ష కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు ని మంగళవారం పెన్ గంగ గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ రాజర్షి షా పూల మొక్క అందించి స్వాగతం పలికిన అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి వరద నష్టం పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా జైనాథ్ మండలం,లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండే దత్తు,తండ్రి లక్ష్మణ్ గారు 27.05.2025న భోరజ్ మండలంలోని తరోడా వంతెనను దాటడానికి ప్రయత్నిస్తుండగా,అనుకోకుండా వచ్చిన తీవ్రమైన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి దుర్మరణం చెందారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుండి బాధితుడి భార్య శ్రీమతి ఎల్.జ్యోతి గారికి రూ.5,00,000/- (ఐదు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయంగా మంజూరు చేసిన చెక్కును ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అందజేశారు. జిల్లా కేంద్రం లోని శాంతి నగర్ లో వర్ష ప్రభావానికి ఇళ్లు కూలిపోవడం తో జిల్లా ఇంచార్జి మంత్రి 4000 వేల రూపాయల నగదును అందించి,కిరాణ సరుకులు అందించాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాలు,వరదల కారణంగా వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్షాలు,వరదల వల్ల జరిగిన నష్టం,సహాయక చర్యలపై పెన్ గంగా గెస్ట్ హౌజ్ లో మంత్రి జూపల్లి జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులకు తగిన సూచనలు చేస్తూ,వరద నష్టంపై శాఖల వారీగా సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆ నివేదికను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి,ఆ మేరకు నిధులు కేటాయించాలని కోరతానని తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు,కుంటలు,కాల్వలకు గండ్లు పడ్డ చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని,విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్,జిల్లా కలెక్టర్ రాజర్షిషా,జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,ఎమ్మెల్యేలు పాయల శంకర్,అనిల్ జాదవ్,వెడ్మ బొజ్జు,ఇతర అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంకోలి లో పర్యటించి తంతోలి వాగును,వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,ట్రైనీ కలెక్టర్ సలోని, అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# బోధనోపకరణాలు ప్రదర్శించిన అధ్యాపకులు



**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రం జెడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బోధనోపకరణాలను సబ్జెక్టుల వారీగా ప్రదర్శించారు. బోధనోపకరణాలను తక్కువఖర్చుతో, అట్టలు, రంగు కాగితాలతో ఆకర్షణీయంగా తయారు చేసి, ప్రదర్శించడం జరిగిందని, వీటితో పిల్లల్లో ఆసక్తి పెంచవచ్చని వినూత్నంగా ఉన్నవాటిని ఎంపిక చేసి జిల్లాకు పంపడం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమానికి విజ్ఞతతలు ముఖ్య అతిథులుగా ఎంపీడీవోలు లచ్చాలు, ఎస్ఐ సిహెచ్ గణేష్ పాల్గొన్నారు.

# పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. జిల్లాలో పంటల సాగు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు తదితరు అంశాలపై రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల్లో సాగు విస్తీర్ణం, ఎరువుల నిలువలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆయా పంటల సాగుకు అణుగుణంగా ఎప్పటికప్పుడు యూరియా స్టాక్ తెప్పిస్తున్నామని స్పష్టం చేశారు. యూరియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమంతంగా ఉండాలని తమ మండలాలకు వచ్చే ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు సరఫరా చేయాలని ఆదేశించారు. రైతులు తమకు అవసరమైన ఎరువులు మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్కదారి పట్టకుండా.. ఇతర అవసరాలకు వాడకుండా చూడాలని ఆదేశించారు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని వారు యాజమాన్య పద్ధతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి ఎరువులు వినియోగించేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం ఏడీఏలు ఏవోలు ఏఈవోలు పాల్గొన్నారు.



## ది ఫ్రీడమ్ ప్రెస్ ఢిల్లీ ఎడిషన్‌ను ప్రారంభించిన మొహమ్మద్ అలీ షబ్బీర్

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్**

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ 'ది ఫ్రీడమ్ ప్రెస్' ఢిల్లీ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి, సుప్రీంకోర్టు న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ మరియు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.




## ఇల్లంతకుంట మండల సమాఖ్య సేవలు ఆదర్శనీయం: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య సేవలు ఆదర్శనీయమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆత్మ నిర్భర్ సంఘాతన్ అవార్డును ఈ నెల 14న కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రెటరీ నుంచి డీఆర్డిఓ, ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు అవార్డు స్వీకరించిన సందర్భంగా మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను జిల్లా కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య బ్యాంకు రుణాల అందజేత, రికవరీ, క్రమం తప్పకుండా మీటింగ్ల నిర్వహణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంపై అభినందించారు. మహిళా సంఘాలకు ఇలాగే సేవలందిస్తూ మహిళలందరూ ఆర్థికంగా రాణించేలా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పథకాల లబ్ధి మహిళలకు చేకూరేలా సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ఆదర్శ మండల సమాఖ్య ను ఆదర్శంగా తీసుకుని మిగతా సంఘాలు సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి అవార్డు తీసుకున్న డీఆర్డీఓ, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య బాధ్యులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా, ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య బాధ్యులు ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.



## కాలనీ లో పర్యటించి నిధులు విడుదల చేస్తా కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

కాలనీ లో పర్యటించి అభివృద్ధి కి కావాల్సిన నిధులు విడుదల చేస్తానని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు మంగళవారం స్థానిక రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేష్ ను శ్రీ సాయి నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ సమస్యలను విన్నవించారు కాలనీ లో నూతన ఆలయం సొసైటీ కార్యాలయం థీమ్ పార్క్ లో వాచ్మెన్ రూమ్ బోర్ వెల్ ఇతర పనులు మిగిలి ఉన్నాయని త్వరలోనే నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చెయ్యాలని అసోసియేషన్ సభ్యులు కోరినారు అందుకు స్పందించిన కార్పొరేటర్ దంపతులు సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీ లో పర్యటించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినామని తెలిపారు



## భారీ వర్షాలు.. విద్యాసంస్థలకు సెలవు : కలెక్టర్ అభిలాష అభినవ్

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, ఆగస్టు 19.**



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రేపు (బుధవారం) నిర్మల్ జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విద్యార్థుల రవాణా, ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు జలమయం కావడం, చెరువులు, ప్రాజెక్టులు నిండిపోవడం, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు ప్రయాణించడం కష్టసాధ్యమని పేర్కొన్నారు.రేపు (ఆగస్టు 20) జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఒకరోజు సెలవు అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లవద్దని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 9100577132లో సంప్రదించవచ్చని తెలిపారు.

## మండప నిర్వాహకులు అధికారుల సమన్వయ సమావేశం పాల్గొన్న కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

మంగళవారం రామచంద్రాపురం డివిజన్ బాలాజీ గార్డెన్ లో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గణేష్ మండపం నిర్వాహకులు అన్ని విభాగ అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో పాల్గొన్నట్లు రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ తెలిపారు సర్కిల్ ఇన్స్పెక్టర్ జగన్నాథ్ జిహెచ్ఎంసి ఎస్ఎస్ కేశవులు డిఈ కృష్ణవేణి ఫైర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పాల్గొని గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై జాగ్రత్తలను వివరించానని కార్పొరేటర్ తెలిపారు భక్తులు తమ విగ్రహాల నిమజ్జనం తొందరగా చేయాలని సూచించారు వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని తొందరగా నిర్వహించాలని కార్పొరేటర్ అన్నారు సౌండ్ సిస్టమ్ కరెంటు లకు ప్రతి ఒక్కరు డిడి కట్టాలని అన్నారు గణేష్ మండపాల వద్ద ప్రతి ఒక్కరి దగ్గర పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా పర్మిషన్ తప్పనిసరిగా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్పొరేటర్ చెప్పారని కార్పొరేటర్ తెలిపారు



## నేడు అమరచింతకు మంత్రి,ఎంపీ రాక

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల కేంద్రంలో నైపుణ్యత స్కిల్ హ్యాండ్లూమ్, చేనేత ఉత్పత్తిదారుల కంపెనీ షోరూం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పాడి పరిశ్రమల, మత్స్య, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ బుధవారం ఉదయం 11 గంటలకు విచ్చేస్తున్నారని అమరచింత నైపుణ్యత స్కిల్ హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రోడక్ట్ సీ.ఈ.వో మహంకాళి చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు హాజరు కావాలని కోరారు.




## పాత్రికేయులకు ఇళ్ల స్థలాలపై ప్రెస్ క్లబ్ నిర్మల్ ఆధ్వర్యంలో మెమోరాండం

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 19ఆగస్టు 19సమయజ్యోతి.**

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలపై ప్రెస్ క్లబ్ నిర్మల్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే నిర్మల్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలిసి వినతి పత్రం అందజేసారు.వీలైనంత త్వరగా పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ పథకంలో ఇళ్ల నిర్మాణాలు, చేపట్టాలని కొరారు. త్వరలోనే దీనిపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. మన వంతు ప్రయత్నం మరింత బలంగా కొనసాగిద్దాం : రాసం శ్రీధర్, ప్రెసిడెంట్ ప్రెస్ క్లబ్, నిర్మల్ ఇకముందు ప్రెస్ క్లబ్ నుంచిఎలాంటి పిలుపు వచ్చిన..పాత్రికేయ మిత్రులందరూ కలిసిరావాలని రాసం శ్రీధర్, ప్రెసిడెంట్ ప్రెస్ క్లబ్, నిర్మల్ పిలుపునిచ్చారు.మనం ఐక్యత చాటితేనేహక్కులను సాధించుకోగలుగుతాం అని, ఆయన అన్నరు.



## గణేష్ మండపాల నిర్వహకులు పోలీస్ ఆన్లైన్ యాప్ లో నమోదు చేసుకోవాలి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**



ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్టణం, గ్రామంలోని గణేష్ మండపాల నిర్వహకులు పోలీస్ ఆన్లైన్ యాప్ లో మండపాలకు వివరాలను నమోదు చేయాలని మంగళవారం పోలీసులు ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్ లోని గుండ్ల చెరువు వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నందున పది ఫీట్లు లోపు వినాయక విగ్రహాలు మాత్రమే తీసుకొని రావాలి. ఎక్కువ ఎత్తు విగ్రహాలను తీసుకువస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. డీజేలు నిషేధం, ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని మనవి చేశారు.

## శాశ్వత కల్వర్టు నిర్మించాలని మున్సిపల్ డీఈకి వినతిపత్రం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

మందమర్రి పట్టణంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పైనుండి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో రైల్వే స్టేషన్ రోడ్ భాగ్యనగర్ కాలనీ కి చెందిన నాలాపై గల కల్వర్టు సైజు చిన్నగా ఉండడంతో కల్వర్టు పూర్తిగా దెబ్బతిందని. కల్వర్టు సైజు పెద్దగా చేసి త్వరగా శాశ్వత కల్వర్టు నిర్మించాలని మున్సిపల్ డీఈ కి వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నాలా పెద్దగా కల్వర్టు సైజు చిన్నగా ఉండడంతో ఈ సంఘటనలు జరుగు తున్నాయని అదేకాక కల్వర్టును తాత్కాలికంగా పైపులతో నిర్మించడంతో నీళ్లు సరిగా వెళ్లక కల్వర్టు పై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తూ ఉందని అన్నారు. చిన్నపాటి వర్షానికి కల్వర్టు నుండి నీళ్లు వెళ్ళక అక్కడే ఆగి వెనక్కి వస్తున్నాయని కల్వర్టుకు దగ్గరలో ఉన్న ఇండ్లలోకి మురికి నీరు వచ్చి చేరుతున్నాయని అన్నారు. మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు సమీపంలోని ఇండ్లు మునిగి ఇంటి సామాన్లు తడుస్తున్నాయని ఏ సమయంలో ఏమవుతుందో అని నిద్రా పోకుండా ఉంటున్నామని అన్నారు. ఈ ప్రాబ్లంని త్వరగా పూర్తి చేయవలసిందిగా కమిషనర్ ని కోరుకుంటున్నామని అన్నారు.




# ఆయిల్ పామ్ సాగు లక్ష్య సాధనకు కృషి చేయాలి

## కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ ఆగస్టు 19 :

జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ సాగు జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యం కాగా, ఈ దిశగా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓ లకు ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంతో లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో 5630 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు జరిగిందని, ఈ సంవంత్సరం1500 ఎకరాలలో ఆయిల్ పామ్ గెలలు కోతకు వచ్చాయని తెలిపారు. రైతులతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు నేరుగా పంటను.ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలను అందిస్తోందని అన్నారు. ఈ పంటను ఒకసారి నాటితే 4 సంవత్సరాల తర్వాత దిగుబడులు ప్రారంభం అవుతాయని, 30 సంవత్సరాల పాటు నిరంతర ఆదాయాన్ని ఇస్తుందని, కోతులు ముట్టని, పందుల బెడద, దొంగల బెడద లేని, తక్కువ కూలీలు అవసరమయ్యే పంట ఆయిల్ పామ్ అని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలకు 90 శాతం రాయితీని ప్రభుత్వం భరిస్తుందని, రైతు కేవలం ఒక ఎకరానికి 1000 రూపాయల చొప్పున జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ అధికారి, నిజామాబాద్ పేరిట డీడీ చెల్లిస్తే 50 మొక్కలు ప్రీ యూనిక్ కంపెనీ వారిచే అందిస్తామని తెలిపారు. ఆయిల్ పామ్ మధ్యలో మొక్కజొన్న, జొన్న, పసుపు, కూరగాయలు, సోయా వంటి అంతర పంటలను సాగు చేసుకోవచ్చని, ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఎకరానికి రూ. 4200/ చొప్పున రైతు ఖాతాలో సంవత్సరానికి ఒకసారి జమ చేస్తారని వివరించారు. చిన్న, సన్నకారు, ఐదెకరాల లోపు విస్తీర్ణం ఉన్న వారికి 90 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులైతే 100 శాతం రాయితీ, 5 ఎకరాల పైబడి విస్తీర్ణంలో





సాగు చేసే వారు 80 శాతం రాయితీ కింద డ్రిప్ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. ఈ విషయాలను రైతులకు అర్థమయ్యే విధంగా తెలియజేస్తూ, లక్ష్యానికి మించి అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జె.గోవిందు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, ప్రీ యూనిక్ కంపెనీ ప్రతినిధులు, అన్ని మండలాల ఏ.ఓ లు, ఏ.ఈ.ఓ లు పాల్గొన్నారు.

# పంటలకు సరిపడినంత యూరియాని సరఫరా చేయాలని బిజెపి ధర్నా

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.

ఆత్మకూరు మండల కేంద్రంలోని వ్యవసాయ పరపతి సహకార సంఘం కేంద్రం దగ్గర రైతులు 10 రోజుల నుంచి యూరియా కోసం పడిగాపులు కాస్తున్న వారికి యూరియా అందకపోవడంతో బిజెపి నాయకులు బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోర్ గౌడ్, మండల బిజెపి అధ్యక్షులు అశోక్ భూపాల్, మండల కార్యదర్శి సాయికుమార్ కార్యాలయం దగ్గరకు వెళ్లి రైతులను యూరియా సరఫరా పై విచారించగా రోజుకు కేవలం కొన్నీ బస్తాల యూరియాని పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గత 10 రోజుల నుంచి సొంత పనులు వదులుకొని అన్నం తినకుండా వర్షంలో తడుస్తూ చెప్పులు క్యూ లైన్ లో పెట్టి యూరియా కోసం ఇక్కడే పడిగాపులు కాస్తున్నామని అన్నారు. రైతులందరినీ రోడ్డు మీదకు తీసుకొచ్చి బిజెపి నాయకులు ధర్నా చేపట్టారు. రైతుల ధర్నా తో రోడ్డుపై వాహనాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోవడంతో డిసిసిబి బ్యాంకు అధికారులు పోలీసు శాఖ వారు జోక్యం చేసుకొని రైతులు యూరియా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్ నరేందర్, డిసిసిబి అధికారులతో మాట్లాడి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల గ్రామాల రైతులు కుర్వ మల్లేష్, రాము నాయక్, తెద్యాన్ నాయక్, తెలుగు వెంకటన్న, గొల్ల చంద్రయ్య, పార్వతమ్మ, రాజు, చంద్రన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# గోల్డ్ మెడల్ విజేత జట్టును సన్మానించిన అధ్యాపక బంధం

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో

అదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్బల్ టోర్నమెంట్ లో నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలం శుద్ధపల్లి స్కూల్ క్రీడాకారుని లికిత రాష్ట్రస్థాయి బెస్ట్ క్యాచర్ అవార్డు, క్రీడా జట్టు గోల్డ్ మెడల్ అందుకోవడం పట్ల మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ నలిని హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ సప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వనిత, స్కూల్ పిఈటిలు జోష్ణ, నర్మద, ఉపాధ్యాయులు అకాడమీ కోచ్ మౌనిక క్రీడాకారినీలను అభినందించారు.



# ఈ రోడ్డుపై ప్రయాణం. ప్రమాద భరితం.

## మండల కేంద్రంలోని దయనియస్థితిలో ఉన్న రోడ్లు

సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణపేట జిల్లా



కృష్ణ మండల కేంద్రంగా ఏర్పడి దాదాపుగా 7 సంవత్సరాలు గడుస్తున్న అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. అనడానికి నిదర్శనం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుండి యూనియన్ బ్యాంక్ వరకు ఉన్న రోడ్డు దుస్థితి.పాలించే ప్రభుత్వాలు మరియు నాయకులు మారుతారేమో గాని రోడ్డు మాత్రం మారడం లేదు అని గ్రామస్తులు అంటున్నారు. నియోజకవర్గ నాయకులు మాత్రం ఎలక్షన్ లో మీ ఓట్లు నాకు వేయండి మీ ఊరు రోడ్లు మీ గల్లీ రోడ్లు బాగు చేయించే బాధ్యత నాది అని చెప్పి ఓట్లు వేయించుకొని గెలుపొందుతారు తీరా చూస్తే సంవత్సరాలు గడిచిన కూడా ఈ రోడ్లను బాగు చేసే బాధ్యత ఎవరు పట్టించుకోరు.మళ్ళీ ఎలక్షన్ కు వస్తారు. వర్షాకాలం వస్తే చాలు నీళ్లన్నీ రోడ్డుపై పారుతూ అడుగడుగున గుంతల మయంగా అయిపోయి నడుచుకుంటూ వెళ్లేవారు మరియు వాహనదారులు అదుపుతప్పి రోడ్డుపై పడిన సంఘటనలు కూడా చాలా ఉన్నాయి అని గ్రామస్తులు తెలిపారు, ప్రతిరోజు మండల కేంద్రానికి మరియు కృష్ణ నదికి వందల మంది వస్తుంటారు పోతుంటారు.అంతేకాకుండా గ్రామంలోని మెయిన్ చౌరస్తా నుండి మరాటి గల్లి కి వెళ్లే రోడ్డు మరియు చౌరస్తా నుండి కృష్ణ నదికి వెళ్లే రోడ్డుపై వర్షం వస్తే చాలు మురికి నీళ్లు, వర్షం నీళ్లు రోడ్డుపైనే పారుతూనే ఉంటాయి.మండల అధికారులు మాత్రం చూస్తూ చూడనట్లుగా ఈ రోడ్లపై తిరుగుతుంటారు మరి వారికి పట్టదా? ఈ రోడ్ల పరిస్థితి ఎందుకింత నిర్లక్ష్యం మా మండల కేంద్రాన్ని బాగు చేసేది ఎవరు పాలించే నాయకులా....! పరిపాలించే అధికారులా....!అని గ్రామస్తులు అడుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలోని ఉన్న సమస్యలను పై అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని కృష్ణ గ్రామ ప్రజలు మరియు మండల ప్రజలు కోరుతున్నారు.

# భారీ వర్షం వల్ల జరిగిన ఆస్తి,పంట నష్టాన్ని ఇన్చార్జ్ మంత్రికి వివరించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ జిల్లాలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి నియోజకవర్గంలో భారీగా పంట నష్టం,ఆస్తి నష్టం జరిగిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.ఆదిలాబాద్ జిల్లాలో వరద నష్టం పై సమీక్షించేందుకు జిల్లా కేంద్రానికి వచ్చిన జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో నష్టపోయిన పంట వివరాలు,అదేవిధంగా పలు ఇళ్లల్లోకి వరద నీరు రావడంతో జరిగిన ఆస్తి నష్టం ప్రజలు పడ్డ ఇబ్బందులను,రైతులు పడుతున్న ఆవేదనను ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అంకోలి లో నష్టపోయిన రైతు జక్కుల గంగన్న నష్ట పోయిన పంటను మంత్రితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.




# రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం,ప్రజలకు ప్రమాదకరం

## విద్యుత్ శాఖ,రోడ్డు నిర్మాణదారు మధ్య సమన్వయ లోపం

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రజలకు ప్రమాదకరంగా మారింది.ఆదిలాబాద్‌లోని వార్డు నంబర్ 33 మరియు 32 మధ్య శాంతి నగర్ ధన్ గర్ గలి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం,విద్యుత్ శాఖ మరియు రోడ్డు నిర్మాణదారు మధ్య సమన్వయ లోపం సూచిస్తుంది.దీని కారణంగా ఈ ప్రాంత నివాసితులు తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది.ఇది ప్రాణాంతక ప్రమాదాలకు కూడా కారణమవుతుంది రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటం వల్ల ప్రమాదం జరిగే ప్రమాదం ఉందని,ముఖ్యంగా రాత్రి సమయంలో మరియు వర్షంలో ప్రమాదం జరుగవచ్చని ఆ ప్రాంత నివాసితులు అంటున్నారు.ఈ స్తంభం అత్యవసర వాహనాల మార్గానికి అంతరాయం కలిగిస్తోందని స్థానికుల వివరాల ప్రకారం ఈ స్తంభాన్ని రోడ్డు నిర్మాణ సమయంలో తొలగించలేదని,ఇప్పటికీ దాని స్థానంలోనే ఉందన్నారు.దీని కారణంగా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు,ముఖ్యంగా విద్యుత్ శాఖ,మున్సిపల్ మరియు యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకుని ఈ స్తంభాన్ని రోడ్డు పక్కకు మార్చాలని స్థానిక వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# ఫోటో ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది.

## - ఎమ్మెల్యే పాయల్ శంకర్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని ఆదిలాబాద్ లో జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ఫోటోగ్రాఫర్ సృష్టికర్త లూయిస్ దాగ్యురే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.అనంతరం ఉత్తమ ఫోటోగ్రాఫర్లకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఫోటోగ్రాఫర్లు తీసే చిత్రాలు పదిలంగా నిలిచిపోతాయని,ఎప్పటికీ గుర్తుండిపోయేలా,అందంగా కనిపించేలా వీడియోలు తీయడం వారికే సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు.సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.కార్యక్రమంలో ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్,విజయ్ కుమార్,జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు దోడ అశోక్,హరికృష్ణ,ఉపాధ్యక్షుడు ప్రవీణ్,జిల్లా గౌరవ సలహాదారులు అనిల్ దేశ్పాండే,గౌరవ అధ్యక్షుడు మురళీధర్,కోశాధికారి సంతోష్,విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఫోటో వెయ్యి భావాలను తెలియచేస్తుంది

## రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 19సమయజ్యోతి**

ఒక్క ఫోటో వెయ్యి భావాలను తెలియ చేస్తుందని, రాష్ట్రంలో ఫోటోజర్నలిస్టుల సంక్షేమానికి వారిలో ప్రొఫెషనలిజం పెంపొందిం చేందుకు చర్యలు చేపడు తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించు కొని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలలో విజేతలకు నేడు బహుమతి, నగదు పురస్కారం అందించే కార్య క్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంజాగుట్టలోని ఒక ప్రైవేట్ హొటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ సి. హెచ్. ప్రియాంక, సిఎం కార్యాలయం సీపీఆర్‌ఓ మల్సూర్‌లు అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కాలాన్ని బంధించి మధుర స్మృతులను అందించే శక్తి ఒక్క ఫోటోగ్రఫర్లకే ఉంటుందని, వారిని ప్రోత్సహించే దిశగా ప్రతీ సంవత్సరం వరల్డ్ ఫోటోగ్రఫీడేను అధి కారికంగా నిర్వహించి, ఫోటో కాంపిటిషన్లలో విజేతలను నగదు బహుమతులు, మెమెంటోలను ప్రదానం చేస్తున్నామని వెల్లడించారు. మాయని జ్ఞాపకాల, తీయాని కల ఫోటోగ్రఫీ అని పేర్కొంటూ, ఎన్నో దశాబ్దాలు గడిచినా ఒక్క ఫోటో మాయని గత స్మృతుల్ని తెలియచేస్తుందని అన్నారు. రాజీవ్ గాంధీ హత్యోదంతాన్ని గుర్తు చేస్తూ, ఆ సంఘటనలో ఉన్న ఫోటోగ్రాఫర్ తీసిన చిత్రం ద్వారానే హంతకులను పట్టుకున్న ఉదంతాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేది ఫోటో జర్నలిస్టులని అన్నారు. స్వాతం త్రోద్యమం నుండి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రచార మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటిలో ఫోటోగ్రఫీకి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక మాట్లాడుతూ, కాలం గడచినా, ఫోటోలు మాత్రం చెక్కుచెదరకుండా గత మధుర స్మృతులను మిగులుస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాలన్నీ సమాచార శాఖ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా



నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 5 విభాగాలకు నిర్వహించిన ఫోటో కాంపిటీషన్‌కు 94 మంది పాల్గొని 744 ఫోటోలను పంపించారని చెప్పారు. ఫోటోగ్రఫీ రంగంలో నిష్ణాతులైన వారిచే ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ విజేతలను ఎంపిక చేసిందని వివరించారు. ప్రధానంగా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రాజీవ్ యువ వికాసం, జనరల్ అనే ఐదు విభాగాలుగా ఎంట్రీలను ఆహ్వానించి ప్రతీ విభాగానికి 8 బహుమతులను ప్రకటించామని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ పోటీలలో పాల్గొన్న విజేతలకు నగదు , శాలువాతో పాటు మెమెంటోను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సి.ఎస్. రామకృష్ణా రావు, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీపీఆర్ఓ మల్సూర్‌లు అందచేశారు.

# ప్రజారోగ్య పరిరక్షణే లయన్స్ క్లబ్ లక్ష్యం

## లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి

**కోరుట్ల,ఆగస్టు 19సమయజ్యోతి:**

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికాయుతంగా ముందుకె ళ్తున్నామని కోరుట్ల లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి అన్నారు. ఉచిత మోతె బిందు శస్త్రచికిత్సలు లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల లో మెరుగైన సేవా సంకల్పంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామంలోని రెడ్డి సంఘ భవనం నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 22 మందికి మోతె బిందు సమస్యతో బాధపడుతున్న వారిగా గుర్తించి, ఉచిత శస్త్ర చికిత్స కోసం రేకుర్తి కంటి ఆసుపత్రికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్ ద్వారా తరలించారు. ప్రతీ ఒక్కరికి రూ. 20వేల ఎల్ ఓసీ సర్జరీలు కోరుట్ల లయన్స్ క్లబ్ తరపున ఉచితంగా చేయించారు. శస్త్ర చికిత్స అనంతరం ఈ నెల 21న తిరిగి చిన్న మెట్‌పల్లి కి భద్రతగా తీసుకురానున్నట్లు క్లబ్ అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏలేటి లక్ష్మారెడ్డి, కోశాధికారి నల్ల గంగాధర్, లయన్స్ క్లబ్ నాయకులు గుంటుక సురేష్ బాబు, అజయేంధర్ రావు, ఉషాకిరణ్, కుందారపు మహేంధర్, కేజీ క్రిష్ణ, కల్లెం గంగారెడ్డి, బెజ్జంకి శ్రీనివాస్ రావు, రాంనారాయణ,ఆదర్శ యూత్ సభ్యులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్య చైతన్యం, అవసరమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ నిరంతరంగా కృషి చేస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి తెలిపారు.

# ఆగస్టు 23 నుండి 31 వరకు 9 రోజుల పాటు వేడుకలు

## రోజుకొక వినూత్న కార్యక్రమం

### క్రీడా వేడుకల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి

దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించినంత ఘనంగా తెలంగాణ రాష్ట్రం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించబోతుందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఈరోజు మినిస్టర్స్ క్వార్టర్స్ లోని ఆయన నివాసంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలపోస్టర్ ను అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రం కూడా నిర్వహించినంత ఉత్సాహభరితంగా దాదాపు తొమ్మిది రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ క్రీడ దినోత్సవ వేడుకలను నిర్వహించబోతున్నామని ఆయన అన్నారు. ఆగష్టు 23వ తేదీ నుండి 31వ తేదీ వరకు హైదరాబాద్ నగరం లోని స్పోర్ట్స్ అథారిటీ క్రీడా ప్రాంగణాలతోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ క్రీడా కార్యక్రమాలకు రూపకల్పన చేశామని తెలిపారు ఈ ఉత్సవాలలో ఏడాది వయసున్న పిల్లలనుంచి 70 ఏళ్ల కు పైబడినసీనియర్ సిటిజన్స్ వరకు ఈ కార్యక్రమాలలో పాల్గొనే విధంగా రోజుకొక కార్యక్రమం చొప్పున రూపకల్పన చేశామని తెలిపారు. క్రీడల పట్ల అవగాహన ఆలోచన ఆచరణ అన్న విధంగా ఈ జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున క్రీడాభిమానులు పాల్గొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు యావత్ క్రీడా కుటుంబ సభ్యులు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. నూతన క్రీడా విధానం 2025 అమలులో భాగంగా జాతీయ క్రీడా దినోత్సవాలను అందర్నీ భాగస్వామ్యం చేస్తూ వివిధ విభిన్న కార్యక్రమాలకు రూపకల్పన జరిగిందని ఆయన వివరించారు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, గత సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవాన్ని మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించిన ఘనత తెలంగాణ రాష్ట్రానికి దక్కిందని అదేవిధంగా ఈ సంవత్సరం కూడా తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున క్రీడాకారులను క్రీడాభిమానులను భాగస్వామ్యం చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఖేలో ఇండియా అధికారి డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా జరగడం లేదు

-ఎరువుల దుకాణాల్లో యూరియా దొరక్కపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

-స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి లేదు

-బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు

**వికారాబాద్ ఆగస్టు 19సమయజ్యోతి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, బీసీల జాబితాలో ముస్లింలను ఎందుకు చేరుస్తున్నారని ప్రశ్నించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు ఇప్పటికే బీసీ–బీ, బీసీ–ఈ, ఈబీసీ కింద రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. రిజర్వేషన్లు విద్య, ఉద్యోగాల్లో మాత్రమే ఉండాలి. రాజకీయాల్లో మాత్రం ఇది సరైన పద్ధతి కాదు. మతం ఆధారంగా రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు "కేంద్రం యూరియా ఇవ్వడం లేదు" అని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులకు నిజమైన కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం. మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా సరిగ్గా జరగడం లేదు. ఎరువుల దుకాణాల్లో యూరియా దొరక్కపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సిగ్గుచేటు. రాబోయే రోజుల్లో ఏ శక్తి అడ్డొచ్చినా, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యం. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వికారాబాద్ జిల్లా పేరును "అనంతగిరి జిల్లా"గా మారుస్తాం. అనంతగిరి పర్యాటక కేంద్రంగా దక్షిణ ఊటీగా ప్రసిద్ధి. అనంత పద్మనాభస్వామి ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో వికారాబాద్‌లో బీజేపీ మూడు అసెంబ్లీ స్థానాలు గెలుస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీని గెలిపించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలి. తెలంగాణ లో ప్రజలు ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని చూస్తున్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఒకే తీరుగా పాలనలో వైఫల్యం చెందాయి. బీఆర్ఎస్ పార్టీ "దళితబంధు, రైతుబంధు" అంటూ మాయమాటలు చెప్పి, సరిగ్గా అమలు చేయక మోసం చేసింది. అందుకే ప్రజలు వారిని ఇంటికి పంపారు. కాంగ్రెస్ పార్టీ "రైతుభరోసా" కింద ప్రతి రైతుకి రూ. 15,000 ఆర్థిక సాయం ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ వాస్తవానికి రెండు విడతల్లో కేవలం రూ. 6,000 మాత్రమే ఇచ్చారు. ఇది రైతులను మోసం చేయడమే. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ పూర్తిగా విఫలమైంది. వికారాబాద్ జిల్లాకు 14,000 ఇళ్లు మంజూరు అయినా, పనులు



మొదలైనవి కేవలం 73 మాత్రమేనని సమాచారం. ఇళ్లు నిజమైన అర్హులైన పేదలకు ఇవ్వకుండా, కాంగ్రెస్ కార్యకర్తలకే కేటాయించడం సరికాదు. అర్హులైన బీదలకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. వికారాబాద్‌లో రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా బీజేపీ గెలుపు ఖాయం. విద్యావంతులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు %–% అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాన్ని గుర్తించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ కు సక్రమంగా పెన్షన్ ఇవ్వడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. కేంద్ర ప్రభుత్వం జన్‌ధన్ యోజన, ముద్ర లోన్లు, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 12 లక్షల కోట్లను కేటాయించింది. కాబట్టి తెలంగాణ అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ సర్కారు అవసరం. ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజల ఇళ్లకు వెళ్లి కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులు వివరించాలని పిలుపునిచ్చారు.

# క్యాపిటల్& ఇన్వెస్ట్మెంట్స్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రి కోమటి రెడ్డి

**హైదరాబాద్ఆగస్టు 19సమయజ్యోతి**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం నాడు క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్స్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర సచివాలయం 6వ ఫ్లోర్ లో సమావేశం జరిగింది. డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీధర్ బాబు,సీతక్క తదితరులు హజరయ్యారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు,అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు,పలువురు అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఇన్ఫ్రాస్ట్రక్చర్ క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నది పనుల పురోగతి కోసం. రాష్ట్ర ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖలు నిత్యం ప్రజలకు కనెక్ట్ అయి ఉండే శాఖలు, రాష్ట్ర రాజధాని నుండి జిల్లా కేంద్రాలు,మండల కేంద్రాలకు మంచి రోడ్ల కనెక్టివిటీ ఉంటే గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇండస్ట్రీస్ వెళ్తాయని అన్నారు. దీంతో రూరల్ లోనే ఉద్యోగ, ఉపాధి కల్పన ఏర్పడుతుంది. ఉద్యోగం,ఉపాధి హైదరాబాద్ లోనే కాదు తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో ఎక్కడైనా దొరుకుతుందనే భావన సృష్టించాలి. అందుకు ప్రజలకు మొదటి ప్రాధాన్యతగా మంచి రోడ్లు ఉండాలి. మంచి రోడ్లు ఉంటే ప్రజా రవాణా, ప్రభుత్వం పై ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ వెళ్లాలన్న రోడ్ స్పీడ్ ను పోల్చి చూస్తారు. రోడ్ల కోసం నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ఎక్కడా వెనుకాడొద్దు అనేది ఫైనాన్స్ మినిస్టర్ భట్టి ,సహచర మంత్రులకు నా సూచన అని అన్నారు. హ్యామ్ విధానంలో చేపట్టాల్సిన రోడ్లను స్పీడప్ చేయాలి.. 3ఏళ్లలో యాక్సిడెంట్స్ కు ఆస్కారం లేని మంచి రోడ్లు అందుబాటులోకి రానున్నాయి. కాంట్రాక్టర్ల పేమెంట్ విషయంలో వారికున్న అభద్రతా భావాన్ని తొలగించాల్సిన బాధ్యత మనపై ఉంది. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక తప్పిదాలు ప్రస్తుతం మనకు ఇబ్బందిగా మారాయని అన్నారు.



# సైబర్ మోసగాళ్ల నుండి రూ.5489 కోట్ల స్వాధీనం

## -12 లక్షలకుపైగా మొబైల్స్ బ్లాక్-13 లక్షలకుపైగా బ్యాంకు అకౌంట్ల సీజ్

-సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ (%జxబా%) కార్యకలాపాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమీక్షలో అధికారుల వెల్లడి

-ఆ సొమ్మును త్వరగా బాధితులకు అందేలా రూల్స్ ను సులభతరం చేయాలని ఆదేశం

-మహిళలు, చిన్నారులు లక్ష్యంగా సాగే ఆన్‌లైన్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరిన కేంద్ర మంత్రి

ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (%x4జ%) ప్రాధాన్యతను వివరించిన మంత్రి

-సైబర్ మోసాలపై స్థానిక భాషల్లో విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరిన బండి సంజయ్

సైబర్ మోసగాళ్ల నుండి ఇప్పటి వరకు రూ. 5489 కోట్లను రికవరీ చేసినట్లు కేంద్ర హొంమంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడిం చారు. ఆ సొమ్మును బాధితులకు రీఫండ్ చేసేలా నిబంధనలను సులభతరం చేయాలని కేంద్ర హొంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన కేసుల్లో సైబర్ కమాండోల సేవలను సమర్థంగా వినియోగించు కోవాలని అధికారులకు సూచించారు. న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్ లోని తన కార్యాలయంలో సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ కార్యకలాపాలను కేంద్ర మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ ప్రాధాన్యతను వివరించారు. సైబర్ నేరాలపై పోరాటంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కల్పించే ప్రధాన కేంద్రంగా ఐ4సీ పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో హొం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సైబర్ మోసాల నియంత్రణలో భాగంగా తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రికి సంబంధిత శాఖ అధికారులు వివరిం చారు. సైబర్ మోసాల బాధితుల నుండి ఇప్పటి వరకు రూ. 5489 కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు 12 లక్షలకుపైగా సిమ్‌లు/మొబైల్ హ్యాండ్‌సెట్లను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. అట్లాగే రూ. 4631 కోట్లు విలువైన మోసపూరిత లావాదేవీలను అడ్డోవడం జరిగిందని, అందులో భాగంగా 13.3 లక్షల మ్యూల్ అకౌంట్లను (సైబర్ మోసాల్లో డబ్బు తరలించడానికి వాడే బ్యాంకు ఖాతాలు) ఫ్రీజ్ చేసినట్లు వివరించారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ లో భాగంగా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ సైబర్ మల్టీ ఏజన్సీ సెంటర్ రిపోర్ట్ చెక్ సస్పెక్ట్ సౌకర్యం, సస్పెక్ట్ రిజిస్ట్రీ, సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్, సైబర్ కమాండోల ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అట్లాగే కేంద్ర రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు, న్యాయమూర్తుల సామర్థ్యాల అభివృద్ధికి సైతం పలు కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అట్లాగే సోషల్ మీడియా, పత్రికలు, ప్రసార్ భారతి, ఆకాశవాణి ద్వారా సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అందులో భాగంగా 1930 పేరుతో సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ హెల్ప్‌లైన్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ జీ–20 సదస్సు, శ్రీ రామ మందిర్ ప్రారంభం, మహాకుంభ్, ఆపరేషన్ సిందూర్ వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాల సమయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసి సైబర్ దాడులను విజయవంతంగా ఎదుర్కోవడంలో కేంద్ర హొంమంత్రిత్వ శాఖ అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. సైబర్ మోసాల బాధితులకు తిరిగి చెల్లించాల్సిన డబ్బు రీఫండ్ ప్రక్రియను సులభతరం చేయాలని, లా ఎన్ఫోర్సుమెంట్ ఏజన్సీలకు ఆధునిక పరికరాలు, శిక్షణతో దర్యాప్తు సంస్థల సామర్థ్యాన్ని మరింతగా పెంపొందిం చాల్సిన అవసరం ఉంద న్నారు.

# నీట మునిగిన ముంబై మహా నగరం

ముంబైఆగస్టు 19సమయజ్యోతి

దేశ ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. కుండపోత వర్షాలకు రోడ్లు, సబ్ వేలు నీటమునిగాయి. వెస్ట్ అంధేరిలో రోడ్లు నదీ ప్రవాహాల్ని తలపిస్తున్నాయి. వర్షాల ప్రభావంతో ఇవాళ స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు. కొందరు యువకులు వరద నీటిలో ఈత కొడుతున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి.

# వైఎస్ వివేకా హత్య కేసు.. కూతురు, అల్లుడిపై పెట్టిన కేసులు క్వాష్ చేసిన సుప్రీంకోర్టు

న్యూ డిల్లీ ఆగస్టు 19సమయజ్యోతి

వైఎస్ వివేకా హత్య కేసులో ఆయన కుమార్తె సునీత, నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి దంపతులపై పెట్టిన కేసులను సుప్రీంకోర్టు క్వాష్ చేసింది. ఈ కేసు విచారణను మంగళవారం చేపట్టిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్కే సింగ్‌ల ధర్మాసనం.. తదుపరి విచారణను సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది.ఈ కేసు విచారణ సందర్భంగా.. అవినాశ్ రెడ్డి సహా ప్రధాన నిందితుల బెయిల్ రద్దు చేయాలని సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. వివేకా హత్య కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని.. అసలు సూత్రధారులు, పాత్రధారులు ఎవరో బయటకు రావాల్సి ఉందని తెలపిఆరు. సాక్షులను బెదిరించడం, సాక్ష్యాలను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని కోర్టుకు వివరించారు. సునీత దంపతులతో పాటు అప్పటి సీబీఐ విచారణాధికారి రాంసింగ్‌పై కుట్రపూరితంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు.సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. నిందితులను కాలపరిమితి లేకుండా జైలులో ఉంచడం మంచిది కాదని అన్నారు. కానీ హత్య తీరు చూస్తే నిందితులకు 2, 5 ఏళ్లు చాలా తక్కువే అనిపిస్తుందని అభిప్రాయం వినిపించారు. ఆధారాలు చెరిపివేయడం, సాక్ష్యాధారాలు లేకుండా చేయడం నిరూపితమైందని పేర్కొన్నారు. హత్య అని తెలియకుండా అన్ని ప్రయత్నాలు చేశారని, అన్ని వివరాలు దర్యాప్తులో పూర్తిగా బయటపడ్డాయని చెప్పారు. కాగా, వాదలు విన్న అనంతరం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సునీత దంపతులతో పాటు అప్పటి సీబీఐ విచారణాధికారి రాంసింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్ చేస్తున్నామని తెలిపింది.

# యాపిల్ ఫోన్ బెంగళూరు కార్యాలయానికి రూ.1,000 కోట్లు అద్దె..!

బెంగళూరు ఆగస్టు 19సమయజ్యోతి

భారత్‌లో ఐఫోన్ల తయారీని భారీగా పెంచడంపై దృష్టి సారించిన దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ సంస్థ.. తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోంది. దేశీయంగా ఐఫోన్ ఉత్పత్తిని పెంచనున్నట్లు ఇప్పటికే యాపిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా బెంగళూరు లో ఎంబసీ జెనిత్ భవనంలో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుంది.డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎంబసీ గ్రూప్ కు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్ లోని ఆ కార్యాలయ స్థలం కోసం 10 ఏళ్ల కాలానికి యాపిల్ సంస్థ డీల్ కుదుర్చుకుంది. 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం యాపిల్ సంస్థ నెలకు రూ.6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఏడాదికి 4.5 శాతం చొప్పున అద్దె పెంపుతో పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపిమొత్తం ఈ పదేళ్లలో సంస్థ రూ.1,000 కోట్లను అద్దెగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. 2025 ఏప్రిల్ 3 నుంచి ఈ లీజు అమల్లోకి వచ్చింది. ఈ లీజు ఒప్పందంలో భాగంగా యాపిల్ రూ.31.57 కోట్లు డిపాజిట్ కూడా చేసింది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అతి పెద్ద మొబైల్ ఫోన్ల ఎగుమతిదారుగా యాపిల్ నిలిచిన విషయం తెలిసిందే. సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన ఫోన్లను ఎగుమతి చేసింది.

# మంత్రి కొండా సురేఖ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్:ఆగస్టు 19సమయజ్యోతి

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ,అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆమెకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.అసెంబ్లీలో పక్కనే కూర్చున్న ఫోటో షేర్ చేస్తూ..సహచర మంత్రి,సోదరి కొండా సురేఖ ఆయురారోగ్యాలతో ప్రజా సేవలో కొనసాగాలని కాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# హత్యకు గురయిన బాలిక కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్ఆగస్టు 19సమయజ్యోతి

హైదరాబాద్ కూకట్‌పల్లిలో హత్యకు గురైన చిన్నారి కుటుంబాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు కరువయ్యాయి.. నగరం నడిబొడ్డున హత్యలు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు. మియాపూర్‌లో పట్టపగలు దొంగతనాలు జరుగుతున్నాయి.. కేపీహెచ్‌బీలో కత్తులు పట్టుకొని ఇండ్లలోకి వెళ్లి దాడులు చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయి మత్తులో తూగుతున్న యువకులపై పోలీసులు కఠినచర్యలు తీసుకోని, భయం పెట్టాలి. గత పది సంవత్సరాలలో క్రైమ్ రేట్ ఏ విధంగా ఉందో, ఈ 20 నెలల కాంగ్రెస్ పాలనలో క్రైమ్ రేట్ ఎలా ఉందో పోలీసులే నిర్ధారించాలని అన్నారు.

# ఇది నామ్ కే వాస్తే ప్రభుత్వం

హైదరాబాద్ఆగస్టు 19సమయజ్యోతి

గత పది రోజులుగా ఏ వార్త పత్రికల్లో చూసినా ముఖ్యమంత్రి సమీక్షా నిర్వహించారని, జిల్లా ఇంచార్జ్ మంత్రులు పరిశీలిస్తున్నారు అని,అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని ప్రకటనలు ఇస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపితే ఏం జరుగుతుంది అనే దానికి నిదర్శనం నిన్న రామంతాపూర్ లో ఆరుగురు మృతి చెందిన సంఘటన ఈ ప్రభుత్వం నామ్ కే వాస్తే నా, కాంకే వస్తే నా అని మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. విద్యుత్ ఘాతానికి రామంతపూర్ లో ఆరుగురు మృతిచెందిన సంఘటనకు నిరసనగా రామంతపూర్ బందుకు పిలుపునివ్వడం జరిగింది. ఈ బందులో బిఆర్ఎస్ ఉప్పల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పనిచేస్తున్నాడా లేదా అనే దానికి నిదర్శనం రామంతపూర్ బందు. ఈ బందులో రాజకీయ పార్టీలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. చనిపోయిన కుటుంబాలకు 50 లక్షల ఎక్స్గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. కాంకే వాస్తవ ఐదు లక్షలు కేటాయిస్తామంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

# ప్రపంచవ్యాప్తంగా పెద్ద సమస్యగా మారిన అనీమియా

## 15-49 ఏళ్ల వయస్సున్న భారతీయ మహిళలలో సుమారు 57 శాతం

## నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే 2019%-%21 నివేదికలో వెల్లడి

న్యూ డిల్లీ ఆగస్టు 19సమయజ్యోతి

ప్రపంచ వ్యాప్తంగా అనీమియా పెద్ద సమస్యగా మారింది. ప్రత్యేకంగా భారతీయ మహిళల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తోంది. నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే 2019-21 నివేదిక ప్రకారం.. 15-49 ఏళ్ల వయస్సున్న భారతీయ మహిళలలో సుమారు 57 శాతం అనీమియాతో బాధపడుతున్నారని తెలుస్తోంది. అంటే ప్రతి 10 మహిళల్లో 6 మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. గర్భిణుల్లో ఈ సంఖ్య సుమారు 52 శాతంగా ఉంది. అదేవిధంగా 15-19 ఏళ్ల యువతిలోనూ సగటున సగానికి పైగానే ఈ సమస్యతో బాధపడుతున్నట్లుగా గణాంకాలు పేర్కొంటున్నాయి.

### అనీమియా అంటే ఏంటీ..?

అనీమియా అంటే రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటం. హిమోగ్లోబిన్ మన శరీరంలోని ప్రతి భాగానికి ఆక్సిజన్‌ను పంపే ముఖ్యమైన ప్రోటీన్. హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే శరీరం అలసటగా, బలహీనంగా మారుతుంది. పనిలో ఆసక్తి తగ్గిపోతుంది. గర్భిణుల్లో అయితే ఇది గర్భస్రావం, తొందరపుట్టే ప్రమాదం పెరుగుతుంది. ఆరోగ్య నిపుణులు భారతీయ మహిళలలో అనీమియా చాలా సాధారణమై ఉందని, ఇది రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఐరన్ లోపమేనని పేర్కొంటున్నారు. జీవనశైలిలో వస్తున్న మార్పులు, దురాలవాట్లు, సామాజిక కారణాలు కూడా ఉంటాయని హెచ్చరి స్తున్నారు. సరైన ఆహారం తీసుకోవడం, వైద్యుల సూచనల మేరకు సప్లిమెంట్స్ తీసుకోవడం, అనీమియా గురించి సరైన అవగాహన ఉంటే సమస్యకు అడ్డుకట్ట వేయొచ్చని చెబు తున్నారు.

### అనీమియాపై ఉన్న అపోహలు.. వాస్తవాలు..

అనీమియాపై ఉన్న అపోహలను తొలగించాలని వైద్యులు పేర్కొంటున్నారు. చాలామంది అనీమియా ఐరన్ కొరత వల్లే కలుగుతుందని అపోహ ఉన్నది. అయితే, అనీమియా అంటే ఐరన్ శరీరంలో ఐరన్ లెవల్స్ తగ్గిపోవడమేనని చాలామంది అనుకుంటారు. కానీ, ఇది పూర్తిగా నిజం కాదు. అనీమియా అంటే రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండడం. ఐరన్ కొరత అనేది ప్రధాన కారణాల్లో ఒకటి. ఫోలిక్ ఆసిడ్, విటమిన్ %దీ%12 లాంటి పోషకాల కొరత కూడా కారణం అవుతుంది. అదేవిధంగా మలేరియా, తలసేమియా వంటి వ్యాధులూ సైతం అనీమియాకు దారి తీస్తాయి. ఐరన్ కొరత వల్ల ఏర్పడే అనీమియా మొత్తం కేసుల్లో సుమారు 50 శాతమే అని అధ్యయనాలు సూచిస్తున్నాయి.సహారులు కాకపోవడం వల్ల అనీమియా వచ్చే ప్రమాదం ఉంటుందనే అపోహ కూడా ఉంది. మాంసాహారంలో ఐరన్ ఎక్కువగా ఉండడంతో, మాంసాహారం తినని వారంతా తప్పనిసరిగా అనీమియా బారినపడుతుంటారని చాలామందిలో అభిప్రాయం ఉంది. ఇది పూర్తిగా నిజం కాదు. మాంసహారం తింటే ఐరన్ లభిస్తుంది. మాంసం, చేపలు తినని వారిలో లోపం ఖచ్చితంగా ఉంటుందని తరచుగా నమ్ముతారు. ఇందులో సగం మాత్రమే నిజం ఉంది. మాంసాహారం తినడం వల్ల అవసరాలు తీరుతాయి. కానీ శాకాహారులకు రక్తహీనత ఖచ్చితంగా వస్తుందని కాదు. శాకాహారంతోనూ రక్తహీనతను తగ్గించొచ్చు, బజ్రా, రాగి, పప్పులు, సోయా, పచ్చి కూరగాయలు, బెల్లం, నువ్వులు, డ్రై ఫ్రూట్స్‌లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది.అలాగే, రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండడం వల్లే అనీమియా వస్తుందని మరో అపోహ సైతం ఉంది. ఇదేం పెద్ద సమస్య కాదని భావిస్తుంటారు. దాంతో అనీమియాను చాలా తక్కువగా అంచనా వేస్తుంటారు. కానీ, ఇలాంటి ఆలోచనలు పూర్తిగా తప్పని నిపుణులు పేర్కొంటున్నారు. అనీమియా శరీరంలో అలసట, తలనొప్పి, దృష్టి సమస్య, పనితీరు తగ్గడం తదితర సమస్యలకు కారణమవుతుంది. గర్భిణుల్లో దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. బిడ్డ తక్కువ బరువుతో పుట్టే ప్రమాదం.. ముందస్తుగానే పిల్లలు జన్మించడం, ఇతర సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి. అందుకే ఏదైనా స్థాయిలో అనీమియా ఉన్నట్లయితే వెంటనే గుర్తించి చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అనీమియా పెరుగుతున్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, సమాజంలో ఉన్న అపోహలను తొలగించి సరైన ఆహారం, వైద్య సహాయం తీసుకోవడంతో పాటు అవగాహన పెంచుకోవడం వల్ల సమస్య నుంచి బయటపడే అవకాశాలుంటాయని పేర్కొంటు న్నారు.

# భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం.. రిస్క్‌లో 3 లక్షల ఉద్యోగాలు

## -టారిఫ్‌లు కొనసాగితే వస్త్ర, రత్నాలు-ఆభరణాల రంగాలకు కష్టాలు

## -ఆటో విడిభాగాల తయారీ, ఎంఎస్ఎంఈలకూ ఇబ్బందులే

## -ఇరు దేశాల మధ్య వాణిజ్య ఆందోళనలపై నిపుణులు

న్యూఢిల్లీ, ఆగస్టు 19సమయజ్యోతి

అమెరికాలోకి వచ్చే భారతీయ వస్తూత్పత్తులపై ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు.. లక్షల్లో ఉద్యోగాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. టారిఫ్‌లు ఇలాగే కొనసాగితే దేశీయ ఎగుమ తులపై తీవ్ర ప్రభావం ఉంటుందని నిపు ణులు హెచ్చరిస్తున్నారిప్పుడు. ముఖ్యం గా అమెరికా మార్కెట్‌పైనే ప్రధానంగా ఆధారపడిన భారత వస్త్ర, రత్నాలు- ఆభరణాల రంగాల్లో 3 లక్షలదాకా ఉద్యోగాలు రిస్క్‌లో పడవచ్చని అంచనా వేస్తుండటం గమనార్హం. .దేశంలో పెద్ద ఎత్తున ఉండే డిమాండ్, అమెరికా యేతర దేశాలకు భారీగా జరుగుతున్న ఎగుమతుల వల్ల సుంకాల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని కొందరు చెప్తున్నా.. మెజారిటీ విశ్లేషకులు మాత్రం కీలక రంగాలు కుదేలేనన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వాహన విడిభాగాల తయారీ సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ) లు ఒడిదొడుకులకు గురి కావచ్చంటున్నారు. ఔషధ రంగం వంటి ఒకట్రెండు ఇండస్ట్రీలపై టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చంటూనే.. చివరకు ఐటీ సేవలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కూడా ప్రభావితం కావచ్చని చెప్తుండటం ఆందోళనల్ని రేకెత్తిస్తున్నది.

కొత్త కొలువుల్లేవ్.. పాత పనులుండవ్

భారతీయ వస్త్ర, రత్నాలు-ఆభరణాల ఎగుమతుల్లో మెజారిటీ వాటా అమెరికాదే. అందుకే ఆ దేశం టారిఫ్‌లు ఇప్పుడు ఈ రంగాల్లో ప్రకంపనల్ని పుట్టిస్తున్నాయి. పెరిగే సుంకాల భారం.. అమెరికాలో భారతీయ వస్త్ర, రత్నాలు-ఆభరణాల వస్తూత్పత్తుల ధరల్ని పెంచగలవు. ఇదే జరిగితే మార్కెట్‌లో అమ్మకాలు పడిపోతాయి. ప్రత్యామ్నాయంగా అమెరికన్లు ఇతర దేశాల నుంచి వస్తున్న వస్త్ర, రత్నాలు- ఆభరణాల వైపు చూసే వీలున్నది. దీంతో క్షీణించే ఎగుమతులు.. ఉత్పత్తి తగ్గుదలకు దారితీస్తే అంతిమంగా వ్యయ నియంత్రణ, ఉద్యోగుల తొలగింపులు, నష్టాల్లో ఉన్న సంస్థల మూసివేతలే ఉంటాయని ఆయా రంగాల నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే సుంకాలు ఇలాగే కొనసాగితే దేశీయ వస్త్ర, రత్నాలు-ఆభరణాల రంగాల్లో 2 నుంచి 3 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డట్టేనని అంచనా వేస్తున్నారు. ఇక ఉన్న ఉద్యోగాలనే తీసేసే కంపెనీలు.. కొత్తగా నియా మకాలకు ఎందుకు వెళ్తాయని కూడా ప్రశ్నిస్తున్నారు. దీంతో ఉద్యోగావకాశాలూ సన్నగిల్లుతాయని పలువురు పేర్కొంటున్నారు. తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో లాజిస్టిక్ వర్కర్లు, షాప్-ఫ్లోర్ వర్కర్లు, సేల్స్ సిబ్బందికి ఇబ్బందులేనన్న అంచ నాలున్నాయి. టెక్స్‌టైల్స్, ఆటో కంపోనెంట్స్, వ్యవసాయ, రత్నాలు-ఆభరణాల రంగాలు అమెరికా సుంకాలతో తీవ్రంగా ప్రభావితమయ్యే వీలున్నది. టారిఫ్‌లు 6 నెలలు ఇలాగే ఉంటే అత్యధికంగా జీవనోపాధినిస్తున్న వస్త్ర పరిశ్రమల్లో లక్ష ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్నది. సూరత్, ముంబై సీప్జ్ వంటి రత్నాల హబ్‌ల్లోనూ పెద్ద ఎత్తున ఉద్యోగులు రిస్క్‌ను ఎదుర్కొంటారు. ఎలక్ట్రానిక్స్, రత్నాలు-ఆభరణాలు, టెక్స్‌టైల్స్, వాహన విడి భాగాలు, తోలు, పాదరక్షలు, రొయ్యలు, ఇంజినీరింగ్ ఉత్ప త్తులు అమెరికా టారిఫ్‌లతో ప్రభావితం అవుతాయి. ఇప్పటికే ఆయా రంగాల్లోని కంపెనీలు వ్యయ నియంత్రణ చేయడం, కొత్త నియామకాల ప్రక్రియను ఆపేస్తున్నాయి.

# విగ్రహాల తరలింపులో విషాదాలు

హైదరాబాద్, ఆగస్టు 19, (సమయజ్యోతి)

హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడ ప్రాంతంలో గణేష్ విగ్రహాన్ని తరలించే సమయంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ట్రాలీపై విగ్రహాన్ని తీసుకెళ్తున్న సమయంలో విద్యుత్ తీగలను కర్రతో పైకి లేపే ప్రయత్నంలో కరెంట్ షాక్ తగిలి ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. ఇదే తరహాలో అంబర్‌పేట్ ప్రాంతంలో కూడా విషాద ఘటన నమోదైంది. రామ్ చరణ్ అనే యువకుడు గణేష్ విగ్రహాన్ని తరలిస్తూ విద్యుత్ తీగలను తొలగించబోతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.కేవలం రెండు రోజుల వ్యవధిలో హైదరాబాద్ నగరంలో మూడు విద్యుత్ ప్రమాదాలు జరిగి 9 మంది చనిపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత ఆదివారం రాత్రి రామంతాపూర్‌లో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా విద్యుదాఘాతానికి గురై ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం ఇంకా మరువక ముందే, ఇవే రకం మరిన్ని ఘటనలు చోటు చేసుకోవడం భయానకంగా మారింది. ఈ నేపథ్యంలో విగ్రహాల తరలింపు సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని అధి,కారులు తీవ్రంగా గుర్తుచేస్తున్నారు. విద్యుత్ తీగలు, హైటెన్షన్ లైన్‌ల సమీపంలో విగ్రహాలు లేదా భారీ వస్తువులు తరలించే ముందు విద్యుత్ శాఖ సహాయాన్ని తీసుకోవాలని సూచి స్తున్నారు. రామంతాపూర్ ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించగా, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వ సహాయం ఎల్లప్పుడూ కుటుంబాలకు అండగా నిలుస్తుందని వారికి భరోసా ఇచ్చారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం లేదన్న విద్యుత్ శాఖ హైదరాబాద్ సమీపంలోని మైలార్ దేవ్ పల్లి- బండ్లగూడ ప్రాంతంలో చోటు చేసుకున్న దుర్ఘటనపై విద్యుత్ శాఖ స్పందించింది. దాదాపు 23 అడుగుల ఎత్తు గల విగ్రహాన్ని ట్రాలీపై తరలించేటప్పుడు ప్రమాదం సంభ వించింది. ఈ ఘటనలో విద్యుత్ శాఖ వల్లే ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు కొన్ని ప్రసార మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అయితే ఈ ఆరోపణలను విద్యుత్ శాఖ ఖండించింది. ఈ అంశంపై స్పందించిన సూపరింటెండింగ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ (రాజేంద్రనగర్ సర్కిల్) శ్రీ రామ్ మోహన్ తాను ఘటన ప్రదేశాన్ని పరిశీలించానని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా మరణాలు జరిగాయని ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. అంతేగాక, ట్రాలీలో ఉన్న వ్యక్తులు అప్రమత్తంగా లేకపోవడం వల్ల ప్రమాద వశాత్తు కింద పడటమే గాయాలకు కారణమై ఉంటుందని వారు వెల్లడించారు. ప్రస్తుతం మరింత లోతుగా విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. పైన ఉన్న 33 కె.వి. విద్యుత్ లైన్ తెగడం, వేలా డడం, లేదా విద్యుత్ సరఫరా లో లోపం ఏర్పడినట్లు ఎక్కడా నమోదుకాలేదని విద్యుత్ శాఖ తెలిపింది. ఇది విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల జరిగిన సంఘటన కాదని, నిర్దిష్టంగా సమాధానం ఇచ్చింది.ఈ ప్రమాద ఘటనపై ప్రజల్లో సందేహాలు తొలగిం చేందుకు విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ స్వయంగా పరిశీలించారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో రథాలు, విగ్రహాలు, భారీ వస్తువుల తరలింపు సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా విద్యుత్ శాఖతో సంప్రదించాలి అని విద్యుత్ శాఖ సూచిస్తోంది.

# ఎన్డిఎ అభ్యర్థికి సపోర్ట్ చేయండి.. ప్రతిపక్షలకు ప్రధాని విజ్ఞప్తి

న్యూఢిల్లీ ఆగస్టు 19సమయజ్యోతి

ఉపరాష్ట్రపతి పవికి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేశాక.. ఆ పదవిలో ఎవరు భర్తీ చేస్తారన విషయంలో ఆసక్తి నెలకొంది. తాజాగా ఎన్డిఎ.. మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేస్తున్న సిపి రాధాకృష్ణన్‌ను తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించింది. అయితే తాజాగా ప్రధాని మోదీ, రాధాకృష్ణను ఉప రాష్ట్రపతిగా చేసేందుకు ప్రతిపక్షాలు మద్ధతు ఇవ్వాలని కోరారు. ఎన్నిక లేకుండా ఉప రాష్ట్రపతిని ఏకగ్రీవంగా ఎంపిక చేసేందుకు అన్ని ప్రతిపక్షపార్టీలు సహకరించాలని మోదీ కోరికనట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్‌లోని బాలయోగి ఆడిటోరియంలో ఎన్డిఎ ఎంపిల సమావేశం జరిగింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌ను మోదీ ఎంపిలకు పరిచయం చేశారు. ఆనంతరం ఆయనను ప్రధాని, కేంద్ర మంత్రులు సన్మానించారు.

# అందుబాటులోకి సిద్ధిపేట రైల్వే స్టేషన్

మెదక్, ఆగస్టు 19, (సమయజ్యోతి)

సిద్ధిపేట జిల్లాలోనే కొమురవెల్లి మల్లన్న క్షేత్రం ఎంత ప్రసిద్ధి చెందిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక్కడ ప్రతీ సంవత్సరం పెద్ద ఎత్తున జాతరను నిర్వహిస్తారు. అది కూడా మూడు నెలల పాటు ఉంటుంది. ఈ సంవత్సరం సంక్రాంతి సమయంలో మొదలై ఉగాది వరకు నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే అక్కడకు వెళ్లాలంటే ప్రస్తుతం బస్సు కనెక్టివిటీ మాత్రమే అందుబాటులో ఉండేది. ప్రస్తుతం కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఉన్నా.. నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఇక్కడ హాల్ట్ ఏర్పాటు చేయలేదు.సిద్ధిపేట జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వెళ్లే భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఓ శుభవార్త అందించింది. ప్రతి ఏటా మూడు నెలల పాటు జరిగే కొమురవెల్లి జాతరకు వేలాదిమంది భక్తులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వస్తుంటారు. ఇప్పటివరకు ప్రధానంగా బస్సు రవాణాపై ఆధారపడిన భక్తులకు ఇకపై రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సోమవారం తన ఎక్స్ ఖాతాలో వివరాలు పంచుకున్నారు. కొమురవెల్లిలో నిర్మాణంలో ఉన్న కొత్త రైల్వే హాల్ట్ స్టేషన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ స్టేషన్‌లో రైళ్లు త్వరలో ఆగుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు 95 శాతం పూర్తయ్యాయని.. కేవలం ఐదు శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్లాట్‌ఫాం షెల్టర్, హై లెవల్ ప్లాట్‌ఫాం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం స్టేషన్ భవనం ఆర్కిటెక్చరల్ పనులు జరుగుతున్నాయి. ఈ రైల్వే హాల్ట్ స్టేషన్ అందుబాటులోకి వస్తే, హైదరాబాద్ సహా పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణం మరింత సులభమవుతుంది. కొమురవెల్లి రైల్వే ప్రాజెక్ట్, భక్తులకు సులభమైన రవాణా మార్గాన్ని కల్పించడమే కాకుండా.. స్థానిక రవాణా వ్యవస్థను కూడా మెరుగు పరుస్తుంది. ఈ ప్రాజెక్టు.. ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను అనుసంధానించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని చాటి చెబుతుందని కిషన్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. దేశంలోని మతపరమైన ప్రదేశాలను రైలు మార్గాలతో అనుసంధానించడం ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఇది ఒక నిదర్శనం. త్వరలోనే ఈ హాల్ట్ స్టేషన్ అందుబాటులోకి వచ్చి.. భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించనుది. ఇదిలా ఉండగా.. కొమురవెల్లి వద్ద కొత్త హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి గతేడాది రైల్వే మంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేసింది. ఇది మనోహ రాబాద్- కొత్తపల్లి మార్గంలో.. లక్డారం, దుద్దెడ స్టేషన్ల మధ్య ఉంది. కేంద్రప్రభుత్వం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ అప్పుడు కిషన్ రెడ్డి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ రైల్వే స్టేషన్ కొమురవెల్లి మల్లన్న భక్తులకు ప్రధాని మోదీ ప్రభుత్వం ఇచ్చిన బహుమతి.. ఇది ప్రతి సంవత్సరం జాతరను సందర్శించే లక్షలాది మంది భక్తులకు ప్రయోజనం చేకూరుస్తుంది' అని ఆయన అన్నారు.

# ఫ్యూచర్ సిటీటూ అమరావతి

హైదరాబాద్, ఆగస్టు 19, (సమయజ్యోతి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీని.. వచ్చే వెయ్యేళ్ల అవసరాలను తీర్చేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీలోని అమరావతికి మధ్య 8 లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. ఈ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడ మధ్య 70 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఇక వీటితో పాటు ఫోర్త్ సిటీని మచిలీపట్నంలోని బందరు పోర్టుకు అనుసంధానించాలని నిర్ణయించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తును మార్చబోతోందని నిపుణులు అంటున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని, రాబోయే 1000 సంవత్సరాల వరకు అనువైన నమూనా నగరంగా దీనిని రూపొందించాలని ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఈ క్రమంలో.. ఫ్యూచర్ సిటీని ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతితో అనుసంధానించడానికి 8 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. ఈ రహదారి నిర్మాణం వల్ల హైదరాబాద్, విజయవాడ మధ్య దూరం సుమారు 70 కిలోమీటర్ల వరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), రీజినల్ రింగ్ రైల్, ఫ్యూచర్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ప్రాజెక్టులను సముద్ర ఓడరేవులతో అనుసంధానిస్తే.. జాతీయ మరియు అంతర్జాతీయ వాణిజ్యం పెరగడంతో పాటు బహుళజాతి సంస్థలు, పెట్టుబడిదారులను ఆకర్షించడం సులభమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.అందులో భాగంగానే.. ఫ్యూచర్ సిటీని ఏపీలోని మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించాలని అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఆర్ఆర్ఆర్ వెంట రెండు డ్రై పోర్టులను ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. వీటిని మెదక్, చౌటుప్పల్ లేదా ఖమ్మం వద్ద నిర్మించే అవకాశాలను పరిశీలిస్తున్నారురాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యంతో.. తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ పాలసీ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ పత్రంలో రాష్ట్రాన్ని కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలుగా విభజించి.. వాటిని వరుసగా సర్వీస్, ఇండస్ట్రీయల్, వ్యవసాయ కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రచించింది. ఈ డాక్యుమెంట్‌ను వచ్చే డిసెంబర్ 9న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ రోజు కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ జన్మదినం కావడంతో ఈ ప్రకటనకు ప్రాధాన్యత లభించింది.

# నీళ్లు - కన్నీళ్లు

అదిలాబాద్, ఆగస్టు 19, (సమయజ్యోతి)

భారీ వర్షాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అతలాకుతలం చేస్తున్నాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో వాగు ఉప్పొంగడంతో రాకపోకలు కూడా సాధ్యం కావడం లేదు. వాంకిడి మండల కేంద్రం లో భారీ వర్షాల కారణంగా వాగులు పొంగిపొర్లుతున్నాయి. సోమ వారం పిప్పర్ గొంది వాగు ఉధృతంగా ప్రవహించడంతో, విద్యార్థులు, గ్రామస్థులు తాడు సహాయంతో వాగును దాటారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పటికీ, తమ అవసరాల నిమిత్తం ఈ సాహసం చేయాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. హుడికిలి వంతెనపైకి వరద నీరు రావడంతో తెలంగాణ - మహారాష్ట్ర మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ల్లా సిర్పూర్ మండలంలోని హుడికిలి గ్రామ సమీపంలో పెన్ గంగా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు వంతెనపైకి చేరడంతో, సోమవారం సిర్పూర్ తహ శీల్దార్ రహీముద్దీన్ అన్ని రకాల రాక పోకలను తాత్కాలికంగా నిలిపి వేయాలని తెలిపారు. ప్రజలు ప్రయాణం చేయకుండా దారిలో కంచెలు వేసి సిబ్బందిని నియమించారు. నీటిలో మునిగిన వంతెనలను ఎవరూ దాటరాదని, ప్రమా దకర ప్రయత్నాలు చేయవద్దని అధికారులు హెచ్చరించారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని సిర్పూర్ టి మండలంలో హుడికిలి, వెంకట్రావుపేట పొడ్స బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం పెరిగింది. భారీ వర్షాల కారణంగా నది ఉప్పొంగి బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తోంది. దీంతో స్థానిక తహసీల్దార్, %ఱఖీూ%, ఎంపీడీఓలు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రవాణాకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పర్యవేక్షణను అధికారులు కొనసాగిస్తున్నారు. దీంతో అధికారుల ఆదేశంతో గ్రామాల్లో డబ్బు చాటింపు కార్యక్రమం చేపట్టారు. వాగులు వరదలు ఉప్పొంగి ప్రవహించే ప్రాంతాల వైపు ఎవరు వెళ్లకూడదని, వాగులు ప్రవహించే వంతెనలు దాటె ప్రయత్నం చేయవద్దనీ, సూచిస్తున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణ కేంద్రాల్లోని రోడ్లన్నీ ఇంకా నీటిలోనే ఉన్నాయి. ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తూండటంతో వాగులన్నీ ఉప్పొంగుతున్నాయి. బెజ్జూర్ మండలంలోని సుస్మీర్ వాగు ...కారణంగా గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తలాయి-భీమారం వద్ద బ్యాక్ వాటర్ రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చింతలమానేపల్లి మండలంలోని దిందా- కేతిని, బాబాసాగర్-నాయకపు గూడ వాగులకు వరద కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. దహెగాం మండలం ఐనం వద్ద లో లెవల్ వంతెన పైకి వరద రావడంతో దహెగాం-కాగజ్‌నగర్ మధ్య వాహనాలు ఆగిపోయాయి. కుమ్రం భీం ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 10 టీఎంసీలు అయినా కట్టబలహీనంగా ఉండడంతో అధికారులు 5 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చూసి మిగతా అంతా దిగువకు వదిలేస్తున్నారు. ప్రాజెక్టులోకి వరద వస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# గణేష్ మండపం... కండిషన్స్ అప్లై

హైదరాబాద్, ఆగస్టు 19, (సమయజ్యోతి)

హైదరాబాద్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేయడానికి కింది అనుమతులు , నిబంధనలు పాటించాలి. ఈ రోజుల్లో ప్రతి గల్లీలో ఓ మండపం పెడుతున్నారు. ఈ క్రమంలో రూల్స్ అండ్ రెగ్యలేషన్స్ పై చాలా మందికి స్పష్టత లేదు. గణేష్ విగ్రహాలనుపబ్లిక్ ప్లేస్‌లలో ఏర్పాటు చేయడానికి సంబంధిత డివిజనల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నుండి ముందస్తు రాత అనుమతి తప్పనిసరి. ఆన్‌లైన్ ద్వారా %ష్ట్రజూం://షషష.ంజూశీ-శ్రీఱఛవ.స్త్రశీఙ.ఱఅ% వెబ్‌సైట్‌లో ఇంటిమేషన్ ఫారమ్ సమర్పించాలి. అయితే అపార్టుమెంట్లలో , ప్రైవేట్ ఇళ్లల్లో పబ్లిక్ కు యాక్సెస్ లేని విగ్రహాలకు ఈ నిబంధనలు వర్తించవు. మండపం ఏర్పాటు చేసే స్థలం ప్రైవేట్ లేదా ప్రభుత్వ భూమి అయినా, ల్యాండ్‌ఓనర్ నుండి నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ తప్పనిసరి. అనధికార విద్యుత్ కనెక్షన్లు నిషిద్ధం. తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (%ు+ూఞణ-జూ%) నుండి అధికారిక విద్యుత్ కనెక్షన్ సర్టిఫికేట్ సమర్పించాలి. సీరియల్ లైటింగ్ లేదా డెకరేషన్ లైటింగ్ మండపం వెలుపల నిషిద్ధం ఒక్కో మండపంలో రెండు బాక్స్-టైప్ లౌడ్‌స్పీకర్లు మాత్రమే అనుమతిస్తారు. రాత్రి 10:00 గంటల నుండి ఉదయం 6:00 గంటల వరకు లౌడ్‌స్పీకర్లు లేదా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు ఉపయోగించకూడదు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం శోభాయాత్ర సమయంలో %ణజీ%లు ఏర్పాటు చేయడం నిషిద్ధం.నిర్వాహకులు తగిన గుర్తింపు కార్డులు, బ్యాడ్జ్‌లతో వాలంటీర్లను నియమించాలి, వీరు దర్శనం కోసం వచ్చే భక్తుల క్యూలను నిర్వహించడం, భద్రతను కాపాడడం ,ఫైర్ సేఫ్టీ చర్యలను పాటించడం చేయాలి. మండపం వద్ద 24 గంటలు కనీసం ఒక వాలంటీర్ ఉండేలా చూడాలి. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. మండపాలు ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా లేదా పబ్లిక్ ఆర్డర్‌కు భంగం కదించకుండా ఏర్పాటు చేయాలి. శోభాయాత్రల కోసం పోలీసు క్లియరెన్స్‌లో నిర్దేశించిన రూట్‌లు, టైమింగ్‌లను ఖచ్చితంగా పాటించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు కోసం https://www.tspolice.gov.in లో దరఖాస్తు చేయవచ్చు మండపం నిర్వాహకులు తమ కమిటీ వివరాలు, బాధ్యతలు వహించే వ్యక్తుల వివరాలు, ఫోన్ నంబర్‌లను మండపంలో ప్రదర్శించాలి. సమస్యలు ఎదురైతే, స్థానిక పోలీసు స్టేషన్‌ను సంప్రదించవచ్చు లేదా హైదరాబాద్ సిటీ పోలీస్ హెల్ప్‌లైన్ 8712665785ను సంప్రదించవచ్చు. గత ఏడాది అనుమతి పొందిన గణేష్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇచ్చింది. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో మండపాలకు పోలీసు అనుమతి అవసరం లేదు, కానీ స్థానిక పోలీసు స్టేషన్‌కు ముందస్తు సమాచారం ఇవ్వాలి.

# బీజూ జనతా దళ్ ఎంపీ సులతా డియో కు ఓ వ్యక్తి బెదిరింపు మెసేజ్‌లు

న్యూఢిల్లీ ఆగస్టు 19సమయజ్యోతి

బీజూ జనతా దళ్ ఎంపీ సులతా డియో కు ఓ వ్యక్తి బెదిరింపు మెసేజ్‌లు చేశాడు. మహేంద్ర గ్రూపులో పనిచేస్తున్న సత్యవ్రత నాయక్ అనే వ్యక్తి ఆ మెసేజ్‌లు చేశాడు. రేప్ చేసి చంపేస్తానని ఆ వ్యక్తి తన సోషల్ మీడియా అకౌంట్‌లో వార్నింగ్ ఇచ్చాడు. దీంతో ఆ ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ ఘటన పట్ల ఆనంద్ మహేంద్ర కంపెనీ ప్రకటన చేసింది. అమర్యాదకర, తప్పుడు ప్రవర్తనను ప్రోత్సహించేది లేదని , వాటి పట్ల జీరో టాలరెన్స్ ఉన్నట్లు ఆ కంపెనీ తన ప్రకటనలో చెప్పింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ ఘటన పట్ల దర్యాప్తుకు ఆదేశించామని పేర్కొన్నది. తమ రూల్స్ ప్రకారం ఆ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.

# కట్టిన రెండు నెలల్లోనే కొట్టుకుపోయిన చెక్ డ్యామ్

మహబూబ్ నగర్ఆగస్టు 19సమయజ్యోతి

మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం గుడిబండ వద్ద పెద్ద వాగుపై వరదకు చెక్ డ్యామ్ కొట్టుకుపోయింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే కట్టిన 2 నెలల్లోనే చెక్ డ్యామ్ కొట్టుకుపోయిందని.. దీని వల్ల తమ పొలాలు, ట్రాన్స్ఫార్మర్, పైప్ లైన్లు కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. నష్టపోయిన తమను ఆదుకొని, నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేసారు.

# మందస మండలంలో భారీ వర్షాలు

శ్రీకాకుళంఆగస్టు 19సమయజ్యోతి

శ్రీకాకుళం మందస మండలంలో అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి .ఈ నేపథ్యంలో దున్నూరు పంచాయతీ గెడ్డూరు గ్రామం లో సముద్రపు ఒడ్డున వరద నీరు కలిసే మార్గంలో ఉన్న ఒక ఇంజన్ బోట్,తెప్ప బోటులు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. మత్స్యకారులు గమనించి శ్రమించి బోట్లను సురక్షితంగా ఉంచడంతో ఆస్తి నష్టం తప్పింది. కొండల నుండి వచ్చిన వరద నీరు,అల్పపీడన ప్రభావంతో సముద్రపు ఒడ్డు కోతకు గురై సురక్షిత ప్రాంతాల్లో పెట్టుకున్న బోటులు కొట్టుకుపోతున్నాయని మత్స్యకారులు తెలిపారు.
అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని నాగావళి, వంశధార నదుల్లో నీటి ప్రవాహం ఉధృతమైంది. ఆముదాలవలస నియోజకవర్గ పరిధిలో నదుల నీటిమట్టం పెరగడంతో రెవెన్యూ అధికారులు నదీ తీర ప్రాంత వాసులను అప్రమత్తం చేస్తున్నారు. బూర్జ మండలం నారాయణపురం ఆనకట్ట వద్ద 20వేల క్యూసెక్కులు, వంశధార నదిలో 9వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉందని అంచనా. అధికారులు డ్రోన్ కెమెరాలతో నదీ తీర ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు.

# జనరిక్ మందుల ప్రమోషన్ కై చర్యలు తీసుకోవాలి

## జనరిక్ మందులు వ్రాయని డాక్టర్ల పై చర్యలు తీసుకోవాలి

గ్రీవెన్స్ లో హనుమకొండ కలెక్టర్ కు పిర్యాదు చేసిన తెలంగాణ హాస్పిటల్స్, పేరెంట్స్ కోఆర్డినేషన్ కమిటి ప్రజా ఆరోగ్యం కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న తెలంగాణ ప్రభుత్వం మందుల వినియోగం, ప్రజా ఆరోగ్యం, డాక్టర్ల పనితీరుపై శ్రద్ధ తీసుకోవడం లేదని, జనరిక్ మందులు వ్రాయడం, ఇతర ప్రజా ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం విడుదల చేసిన జి.ఒ లను అమలు చేయాలని తెలంగాణ హాస్పిటల్స్ - పేరెంట్స్ కోఆర్డినేషన్ కమిటి రాష్ట్ర అధ్యక్షులు బి. సతీష్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ సంయుక్తంగా హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ కు ఇచ్చిన పిర్యాదులో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2011 లో జారీ చేసిన జి.ఒ.ఎం.ఎస్ నంబర్ 54, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2016 లో జారీ చేసిన అతిసాదారణమైన నోటిఫికేషన్ పార్ట్ 3, సెక్షన్ 4 ప్రకారం మెడికల్ కౌన్సిల్ లో రిజిస్టర్ అయిన ప్రతి డాక్టర్ వారు వ్రాసే మందులను జనరిక్ పేర్లతో మాత్రమే వ్రాయాలని నిబంధన ఉన్నప్పటికీ చాలా మంది డాక్టర్లు వ్రాయడం లేదని ఆ పిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే డాక్టర్లపై, హాస్పిటల్స్ పై వృత్తిపరమైన చెడు ప్రవర్తనకు పాల్పడినందుకు క్రమశిక్షణ చర్యలతో పాటు, అపరాధ రుసుము వేసి చర్యలు తీసుకునే అధికారం ఉన్నతాధికారులకు ఉందని నిబంధనలు ఉన్నపటికీ అలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, ఎంసిఐ నిబంధనల ప్రకారం వివిధ ప్రజా ఆరోగ్య సమస్యలు, జనరిక్ మందుల వినియోగం కోసం ప్రజలను చైతన్యం చేయడంతో పాటు, అమలు తీరుపై సమీక్ష జరపడం కోసం జిల్లా కలెక్టర్ చైర్మన్ హోదాలో జిల్లా స్థాయి కమిటీ (డి ఎల్ సి) నియమించాలని సూచనలు ఉన్నపటికీ అలాంటి కమిటీ నియమించలేదని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వెంటనే పేరెంట్స్, అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు ఫార్మసీ కంపెనీలతో కుమ్మక్కైన డాక్టర్ల దోపిడీని అరికట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఎఫ్ నాయకులు ఐతం నగేష్, న్యాయవాదులు మొగిలయ్య, ఎగ్గడి సుందర్ రామ్ లు పాల్గొన్నారు.

# వీవో కంపెనీ ఫోన్ పేలి ఇంట్లో చెలరేగిన మంటలు

ఖమ్మంఆగస్టు 19సమయజ్యోతి

వీవో మొబైల్ ఫోన్ పేలడంతో ఇంట్లో మంటలు అంటుకున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మామిళ్లపల్లి కాంప్లెక్స్ సమీపంలోని ఒక ఇంట్లో ఛార్జింగ్ పెట్టిన వీవో ఫోన్ పేలడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేసారు. దాదాపు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుతు వాపోతున్నాడు.

# నిద్రపోతున్న ఆరోగ్యశాఖ

## తెలంగాణలో భారీగా పెరిగిన ఆబార్షన్లు

హైదరాబాద్, ఆగస్టు 19, (సమయజ్యోతి)

కొంతమంది సంతానం కోసం ఆరాటపడుతూ ఉండగా.. మరికొంతమంది సంతానం కావద్దని అబార్షన్లు చేసుకుంటూ ఉన్నారు. ఇలా చేసుకుంటూ ఉండే వారి సంఖ్య గతంలో కంటే ఇప్పుడు బాగా పెరిగిపోయిందని కొన్ని లెక్కలను బట్టి చూస్తే తెలుస్తుంది. భారతదేశంలో ప్రతి సంవత్సరం 11 నుంచి 12 లక్షల వరకు అబార్షన్లు జరుగుతున్నట్లు కొన్ని లెక్కలను బట్టి చూస్తే అర్థమవుతుంది. అయితే ఇటీవల బయటపెట్టిన ఓ నివేదిక ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో ఎక్కువగా అబార్షన్లు పెరిగాయని తేలింది. ఆ వివరాలు లోకి వెళ్తే..కొంతమంది గర్భం వద్దనుకునేవారు.. ఇతర సమస్యలు ఉన్నవారు అబార్షన్లు చేయించుకుంటూ ఉంటారు. అయితే ఎక్కువ శాతం గర్భనిరోధం కోసమే అబార్షన్లు అవుతున్నట్లు తేలుతుంది. 2020-21 సంవత్సరంలో తెలంగాణలో 1578 అబార్షన్లు జరగగా.. 2024-25 సంవత్సరంలో 16,059 అబార్షన్లు జరిగాయి. అంటే గత మూడేళ్లలో 917% కేసులు పెరిగాయి. అదే ఆంధ్రప్రదేశ్లో 2024 -25 లో 10,676 కేసులు నమోదయ్యాయి. అబార్షన్లపై తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక అవగాహనలు కల్పిస్తున్నారు. గర్భం రాకుండా ఉండడానికి రక్షణ చర్యలు ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. కొందరు అబార్షన్ల వైపు పోకుండా మాత్రాలను వేసుకోవాలని సూచిస్తున్నారు. కానీ అనుకోకుండా వచ్చిన గర్భం వల్ల కూడా ఈ కేసులు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా రక్షణ చర్యలను ఏర్పాటు చేసుకోవడంలో విఫలమవుతున్నట్లు కనిపిస్తోంది.అయితే దేశవ్యాప్తంగా చూస్తే కేరళలో అత్యధికంగా 25, 884 కేసులు నమోదయ్యాయి. అయితే అబార్షన్లు ఎక్కువగా కావడం వల్ల మహిళల్లో అనేక రకాల సమస్యలు వచ్చే అవకాశముంది. దీనిపై తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ఎక్కువ శాతం పట్టణాలు, నగరాల్లో ఉండేవారు అబార్షన్లు చేయించుకున్నట్లు తెలుస్తోంది. అనుకోకుండా కలయిక వల్ల లేదా కొన్ని రకాల కారణాల వల్ల ఆకస్మిక గర్భం రావడం.. దీంతో ఏం చేయాలో తెలియక అబార్షన్ కి మొగ్గు చూపడం వంటివి చేస్తున్నారు.గర్భం రాకుండా కొందరు అనేక మాత్రలు తీసుకుంటున్నారు. కానీ ఈ మాత్రల వల్ల తర్వాతి కాలంలో అండం విడుదల అయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయన్న ప్రచారం ఉంది. ఫలితంగా అబార్షన్లు చేయించుకోవడమే సరైన మార్గమని అనుకుంటున్నారు.

# నెల్లూరులో లేడీ నయిం...?

**నెల్లూరు, ఆగస్టు 19, (సమయజ్యోతి)**

తెలంగాణలో అప్పట్లో నయీం సృష్టించిన రౌడీయిజం గుర్తుకుందా.. అతడు చనిపోయిన తర్వాత మీడియాలో.. అతడి గురించి కథలు కథలుగా కథనాలు ప్రసారమయ్యాయి. భువనగిరి మాత్రమే కాదు.. తెలంగాణ మొత్తం అతడు దందాలకు పాల్పడినట్టు ఆ తర్వాత మీడియాలో వార్తలు వచ్చాయి. నయీం ను అంతం చేయడానికి ఏకంగా కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయంటే.. అతడి నేర సామ్రాజ్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు నెల్లూరులో కూడా ఓ మహిళ నయీం లాగానే నేరా సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఏకంగా పోలీస్ వ్యవస్థను.. రాజకీయ వ్యవస్థను తన చేతిలో పెట్టుకొని రెచ్చిపోతున్నది.ఆదివారం సోషల్ మీడియాలో కరుడుగట్టిన నేరస్థుడితో ఆ మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత సన్నిహితంగా ఉన్న వీడియో చక్కర్లు కొట్టింది. అంతకుముందు ఏ ఎస్పీతో ఐ లవ్ యు అని ఆమె చెప్పించుకున్న ఆడియో కూడా సెన్సేషన్ క్రియేట్ చేసింది. వాస్తవానికి ఆ కరుడుగట్టిన నేరస్తుడు నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి విడుదల కావడానికి ప్రధాన కారణం సదరు మహిళ అని తెలుస్తోంది. ఎక్కడో నెల్లూరు జిల్లాలో మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో పుట్టిన ఆమె ఇక్కడిదాకా ఎదగడానికి అన్ని రకాల అడ్డదారులు తొక్కింది. చివరికి తన ప్రవృత్తికి.. తన అడ్డదిడ్డమైన ఎదుగుదలకు భర్త అడ్డుగా ఉన్నాడని అతడిని కూడా రోడ్డు ప్రమాదంలో చంపించేసింది. అక్కడి నుంచి మొదలైన ఆమె నేర ప్రస్థానం దినదిన ప్రవర్తమానంగా ఎదుగుతూ వస్తోంది. వేగంగా రాజకీయాలను, పోలీసులను శాసించే స్థాయికి ఆమె ఎదిగింది.ముగ్గురు ఎస్పీలు వద్దని చెప్పినప్పటికీ.. ఏకంగా ఆమె ఒక నేరస్తుడికి బెయిల్ ఇప్పించుకుంది. పోలీసులు మాత్రమే కాదు.. ఏకంగా సెక్రటేరియట్ లో పనిచేసే మంత్రులు, ఉన్నతాధికారులతో ఆమె పని చేయించుకోవడం మొదలు పెట్టింది. గతంలో ఆమె ఒక పార్టీకి అనుకూలంగా ఉండగా.. ఇప్పుడు అధికారంలో ఉన్న మరో పార్టీ నాయకులతో ఆమె అంట కాగడం సంచలనం సృష్టిస్తోంది. కేవలం దందాలు మాత్రమే కాకుండా దౌర్జన్యాలు, నేరమయ కార్యకలాపాలకు ఆమె పాల్పడుతోందని ఆరోపణ వినిపిస్తున్నాయి. జైల్లో ఉన్న వ్యక్తి పేరుతో ఆమె నేరాలు చేస్తున్నారని.. ఒక ముఠాను కూడా ఆమె నిర్వహిస్తున్నారని సమాచారం. మాదకద్రవ్యాల వ్యాపారం లోకి కూడా ఆమె అడుగు పెట్టారని.. అడ్డగోలుగా సంపాదిస్తూ సమాంతర వ్యవస్థను నడిపిస్తున్నారని సమాచారం. అయితే ఇంత జరిగిన తర్వాత.. మీడియా ద్వారా ఇంత వెలుగులోకి వచ్చిన తర్వాత.. ఆమెపై కూటమి ప్రభుత్వ పెద్దలు ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# అమ్మకానికి జగన్ అన్న ఇళ్లు

**గుంటూరు, ఆగస్టు 19, (సమయజ్యోతి)**

గత ప్రభుత్వం పేద ప్రజలకు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. ఆ స్థలాల్లో ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందించింది. పెద్ద పెద్ద కాలనీలను ఏర్పాటు చేసి వాటికి జగనన్న కాలనీలు అని పేరు పెట్టారు. అయితే సాధారణ ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జగనన్న కాలనీల్లో పనులు ఎక్కడవక్కడే నిలిచిపోయాయి. ఈ కాలనీల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలంటే చాలా పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. దీంతో కాలనీల్లో మౌళిక సదుపాయాలలేమితో ఇళ్లలో ఉండేందుకు స్థానికులు ఇష్టపడటం లేదు.ఈ క్రమంలోనే తెనాలి పట్టణ పరిధిలోని నేలపాడు జగనన్న కాలనీలో ఉన్న ఇంటిని ఓ లబ్దిదారుడు ఏకంగా ఓఎల్ఎక్స్‌లో విక్రయానికి పెట్టడం ఆసక్తికరంగా మారింది. అప్పులు చేసి నిర్మించుకున్న ఇంటిలో ఉండలేక ఇంటిని అమ్మేస్తున్నట్లు లబ్దిదారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే నేలపాడు కాలనీకిలో ఓ ఇంటిని తొమ్మది లక్షల రూపాయలకు బేరం పెట్టారు. అయితే ఏకంగా ఓఎల్ఎక్స్ లో విక్రయానికి పెట్టడంపై తెనాలి పట్టణంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. గతంలోనే చాలామంది తమకు వచ్చిన ఇంటి స్థలాలను విక్రయించుకున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ ధరకు ఇల్లు, ఇంటి స్థలాలు వస్తుండటంతో కొంతమంది కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఇల్లు అయితే తొమ్మిది లక్షల రూపాయల నుండి పన్నెండు లక్షల రూపాయల వరకూ విక్రయిస్తుండగా ఇంటి స్థలాన్ని మూడు లక్షల రూపాయల నుండి ఆరు లక్షల రూపాయలకు విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వం పట్టణ ప్రాంతంలో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలాన్ని పేదలకు ఇచ్చింది. గుంటూరు జిల్లాలో ఓఎల్ఎక్స్ లో జగనన్న కాలనీ ఇల్లు ప్రత్యక్ష కావడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది

# వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19సమయజ్యోతి**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుల బెయిళ్లు రద్దు చేయాలని వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై దాఖలైన అన్ని పిటిషన్లను కలిపి విచారణ చేశారు. విచారణలో సీబీఐ అధికారి రాంసింగ్ తో పాటు వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డిపై అప్పట్లో పులివెందుల పోలీసులు పెట్టిన కేసును క్వాష్ చేసింది. దర్యాప్తును ప్రభావితం చేసేందుకు అధికార దుర్వినియోగం చేసి కేసు పెట్టినట్లుగా ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ , జస్టిస్ ఎన్.కె. సింగ్‌ల ధర్మాసనం ఈ కేసు విచారణను నిర్వహించింది. వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, అప్పటి సీబీఐ విచారణాధికారి రామ్ సింగ్‌పై నమోదైన కేసులను సుప్రీంకోర్టు క్వాష్ చేసింది. ఈ కేసులు కుట్రపూరితంగా నమోదు చేశారని కోర్టు గుర్తించింది. జస్టిస్ సుందరేశ్ ఈ కేసులు చట్టాన్ని దుర్వినియోగం చేసి, వేధించడానికి పెట్టారని ఇది ఒక రకమైన బెదిరింపుగా ఉందని అభిప్రాయపడ్డారు. సునీత తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ప్రధాన నిందితులైన అవినాష్ రెడ్డి, ఇతరుల బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. సీబీఐ కేవలం సుప్రీంకోర్టు గడువు కారణంగానే దర్యాప్తు ముగిసినట్లు పేర్కొందని, కానీ ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు అవసరమని లూథ్రా వాదించారు. అసలు సూత్రధారులు , హత్యలో పాత్రధారులు ఎవరనేది ఇంకా బయటపడాల్సి ఉందని, సాక్షులను బెదిరించడం, యు సాక్ష్యాధారాలను నాశనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన కోర్టుకు తెలిపారు. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు సీబీఐ తరపున వాదనలు వినిపించారు. హత్య క్క తీవ్రతను బట్టి చూస్తే, నిందితులు కేవలం 2 లేదా 5 సంవత్సరాలు జైలులో ఉండటం తగిన శిక్ష కాదని అన్నారు. తొలుత గుండెపోటుగా, ఆ తర్వాత రక్త వాంతులుగా చిత్రీకరించడానికి ప్రయత్నాలు జరిగాయని, సాక్ష్యాధారాలను చెరిపేసేందుకు , హత్య విషయం బయటపడకుండా చేయడానికి అన్ని విధాలుగా కుట్రలు జరిగాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో సాక్ష్యాలు చెరిపేయడం , సాక్ష్యాధారాలు లేకుండా చేయడం నిరూపితమైందని, దర్యాప్తులో అన్ని వివరాలు బయటపడ్డాయని ఎస్వీ రాజు కోర్టుకు తెలిపారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపించారు. నిందితుడు డి. శివశంకర్ రెడ్డి కుమారుడు దేవిరెడ్డి చైతన్య రెడ్డి, మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లి, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలు ఉన్నాయని తెలిపారు. ఈ బెదిరింపులకు సంబంధించిన ఫోటోలతో సహా ఆధారాలు ఉన్నాయని కోర్టుకు వివరించారు. సీబీఐ తరపు న్యాయవాది ఈ కేసులో హత్య యొక్క తీవ్రతను బట్టి, నిందితులకు మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉందని సుప్రీంకోర్టుకు తెలిపారు. సీబీఐ ఆగస్టు 5, 2025న సుప్రీంకోర్టుకు తెలియజేసిన విధంగా, ఈ కేసులో దర్యాప్తు పూర్తయినట్లు పేర్కొంది. అయితే, సుప్రీంకోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీబీఐ తెలిపింది. సునీత తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, దర్యాప్తు ఇంకా లోతుగా జరగాలని, అసలు సూత్రధారులను గుర్తించాల్సిన అవసరం ఉందని వాదించారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ రణం

## విభాగాలను ప్రైవేటీకరించేందుకు ప్రకటన

**విశాఖపట్టణం, ఆగస్టు 19, (సమయజ్యోతి)**

విశాఖ స్టీల్ ప్లాంట్ చుట్టూ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రైవేటీకరణ అంశం గత కొన్నేళ్లుగా కుదిపేస్తోంది. అయితే ఈ ప్లాంట్ విషయంలో మాత్రం కేంద్రం అనుసరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. కొద్ది రోజుల కిందట కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. దీంతో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అనేది జరగదని అంతా భావించారు. కూటమి నేతలు సైతం స్టీల్ ప్లాంట్ విషయంలో అనేక రకాలుగా భరోసా కల్పిస్తూ.. నమ్మకమైన ప్రకటనలు చేశారు. అయితే ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా ఓ పరిణామం జరిగింది. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం పలు విభాగాలను ప్రైవేటు పరం చేసేందుకు టెండర్లు జారీచేసింది. దీంతో కార్మికులతో పాటు ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. ప్రైవేటీకరణ లో భాగంగానే ఇలా చేస్తున్నారన్న అనుమానాలు మొదలయ్యాయి. కార్మికులు, ఉద్యోగులు ఆందోళన బాట పడుతున్న నేపథ్యంలో ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేయడంపై విస్మయం వ్యక్తం అవు తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం అను కున్నది సాధించి తీరుతుందని ఎక్కువ మంది అభిప్రాయ పడుతున్నారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అనేది ఇప్పటిది కాదు. ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ చేసి తీరుతామని కేంద్రం పలుమార్లు స్పష్టం చేసింది. అదే సమయంలో వివరణ కూడా ఇచ్చింది. ఒకవైపు ప్రైవేటీకరణకు సంబం ధించి ప్రకటనలు వచ్చాయి. మరోవైపు కేంద్ర మంత్రులు నేరుగా వచ్చి స్టీల్ ప్లాంట్ విషయంలో భరోసా ఇచ్చే ప్రయ త్నాలు చేశారు. ప్లాంట్ ఉత్పత్తులకు సంబంధించి ఆర్థిక ప్యాకేజీ పదకొండు వేల కోట్ల రూపాయలను అందించింది కేంద్రం. దీంతో ప్రైవేటీకరణ అనేది నిలిచి పోయిందని అంతా భావిస్తున్న తరుణంలో ఆజాగా వెలువడిన ఒక నోటిఫికేషన్ సరికొత్త సమస్యను తెరమీదకు తెచ్చింది. అంచలంచెలుగా.. దశలవారీగా ప్లాంట్ ను ప్రైవేటు పరం దిశగా అడుగులు పడుతున్నట్లు స్పష్టమవుతోంది. కర్మాగారాన్ని రక్షిస్తామని యాజమాన్యం ఒక వైపు ప్రకటనలు చేస్తూనే ఉన్నా.. మరోవైపు దశలవారీగా విభాగాలను ప్రైవేటీకరిం చేందుకు సిద్ధపడుతుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.స్టీల్ ప్లాంట్ లో చాలా రకాల విభాగాలు ఉంటాయి. అందులో ప్రస్తుతం 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ఉక్కు యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై ఉద్యోగులతో పాటు కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. యాళ్ల తరబడి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూ వచ్చారు. అయినా సరే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. ఒక పద్ధతి ప్రకారం స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించేందుకు అడుగులు వేస్తున్నట్లు కనిపి స్తోంది. ఇప్పటివరకు కొన్ని విభా గాలను ప్రైవేటీకరించేందుకు వరుసగా నోటిఫికేషన్లు జారీచేసింది యాజమాన్యం. తాజాగా ఒకేసారి 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ప్రకటన విడుదల చేసింది. దీంతో కార్మికులతో పాటు ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు ప్లాంట్ కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెబు తోంది. ఇప్పుడు ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది.వాస్తవానికి ఎట్టి పరిస్థితుల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాదని కూటమి నేతలు హామీ ఇచ్చారు. కేంద్రంలో ఇప్పుడు తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. ఆపై పవన్ కళ్యాణ్ సైతం గుర్తింపు కలిగిన నాయ కుడిగా ఉన్నారు. ఆయన సైతం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తే ఊరు కోమని హెచ్చరించారు కూడా. ప్లాంటు భవితవ్యం పై చాలా రకాలుగా హామీలు ఇచ్చారు. మరింత కష్టపడి ప్లాంట్ ఉత్పత్తిని కూడా పెంచాలని సూచిం చారు. దీంతో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారు ఉద్యోగులతో పాటు కార్మికులు. ఇలా చేస్తున్న క్రమంలో ఒక్కో విభాగాన్ని ప్రైవేట్ పరం చేయడం మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకవేళ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే కూటమి నేతలపై సైతం ఒత్తిడి పెరగడం ఖాయం. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# అమరావతిపై మీ ఏడుపులు ఇకనైనా ఆపండి

-గుంతల్లోకి నీరు వస్తె ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా? -పశ్చిమ బైపాస్ పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో కొండవీటి వాగు వరద నీరు నిలిచిపోయింది -కారణాలు తెలియకుండా వైసీపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు-మంత్రి నారాయణ

**అమరావతి...ఆగస్టు 19సమయజ్యోతి**

రాజధాని అమరావతి మునిగి పోయిందంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోన్న వైసీపీ నాయకులపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు... అమరావతిపై ఏడుపులు ఇకనైనా ఆపాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు... అమరావతిలో కొండవీటి వాగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో వరద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను మంత్రి నారాయణ పరిశీలించారు...అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారధి తో కలిసి ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు... విజయవాడ పశ్చిమ బైపాస్ పై ఈ - 11 రోడ్డు వద్ద కొండవీటి వాగుపై నేషనల్ హైవేస్ అధికారులు ఓ వంతెన నిర్మించారు...ఈ వంతెన నిర్మాణ సమయంలో అక్కడ మట్టిని అలాగే వదిలేయడంతో అక్కడే కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది...దీంతో వంతెన దిగువ నుంచి నీరు వెళ్లే మార్గం లేక నీరుకొండ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో వరద నీరు నిలిచిపోయింది....వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి నారాయణ అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసారు...ప్రొక్లెయిన్ లు ఏర్పాటు చేసి మట్టి తొలగించడంతో పాటు జాతీయ రహదారి పై కూడా స్వల్పంగా గండి కొట్టి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు... ఆ తర్వాత అక్కడికొచ్చిన మీడియా తో మంత్రి నారాయణ మాట్లడుతూ వైసీపీపై తీవ్రంగా మండిపడ్డారు. అమరావతిపై ఇకనైనా మీ ఏడుపులు ఆపాలంటూ వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. లేదంటే ఈసారి ఆ 11 సీట్లు కూడా ప్రజలు మీకివ్వరన్నారు...ఎక్కడైనా నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...?గుంతల్లోకి నీరు వస్తె ఐకానిక్ భవనాలు మునిగి పోయినట్లేనా?అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు..అమరావతిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించరని అన్నారు...పశ్చిమ బైపాస్ పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా



ఉండటంతో నీరు నిలిచిపోయిందన్న మంత్రి...అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో నీరు నిలిచిందన్నారు.మిగతా గ్రామాల్లో వర్షం పడిన కొన్ని గంటల్లోనే నీరు బయటికి వెళ్లిపోయిందన్నారు...ప్రస్తుతం కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని వేగంగా తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు మంత్రి..ఎవరెన్ని అనుకున్నా అమరావతి పనులు జరిగి పోతూనే ఉంటాయన్నారు..వచ్చే మార్చి నాటికి అధికారులు,ఉద్యోగుల క్వార్టర్లు కూడా సిద్దం చేస్తున్నామన్నారు... రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేస్తున్న వారు అమరావతికి వచ్చి పరిస్థితి చూడాలని మంత్రి సూచించారు.

# పేదరిక నిర్మూలనే పి-4 లక్ష్యం

**-సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ఆకాంక్ష-గివ్ బ్యాక్ అన్నది సమాజ నినాదం కావాలి**

**-ఎదిగిన వారు పేదలను పైకి తీసుకురావాలన్న కార్యక్రమం ఇది-మంగళగిరిలో పి-4 కార్యక్రమాన్నిప్రారంభించిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,ఆగస్టు19(సమయజ్యోతి):**

పేదరికాన్ని సమూలంగా, శాశ్వతంగా నిర్మూలించాలనే బలమైన లక్ష్యంతో పీ4 విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అన్నారు. పీ4ను ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసు కుంది. తొలిదశలో 15 లక్షల బంగారు కుటుంబాల ఎంపికపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. పీ4 (4) (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని మంగళ గిరిలో చంద్రబాబు నాయుడు మంగళ వారం ప్రారంభించారు. మార్గదర్శుల ఎంపికపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించారు. పీ4 సంబంధిత మార్గదర్శులతో ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రత్యేక భేటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గివ్ బ్యాక్ అనేది మన సమాజ నినాదం కావాలని దిశానిర్దేశం చేశారు. సమాజం వల్ల పైకి వచ్చిన వారు తిరిగి సమాజానికి ఎంతో కొంత తిరిగి చేయాలని కోరారు. సంపద ప్రజలకు మెరుగైన జీవనం కలిగేలా ఉపయోగ పడాలని సూచించారు.పీ4 చాలామంది జీవితాల్లో గొప్పమార్పు అవుతుందని ఉద్ఘాటించారు. ఇంటర్ పాస్ అయిన అమ్మాయికి రెండు నెలల్లో ట్రైనింగ్ ఇచ్చి నెలలో ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పించామని చెప్పుకొచ్చారు. ఆ అమ్మాయి భవిష్యత్తులో మార్గదర్శి కావాలని కోరుకుంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పీ4పై శక్తి ఉండే ప్రతి వ్యక్తి అండగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఉగాది రోజు పీ4 కార్యక్రమం గురించి మొదటిసారిగా చెప్పానని.. నేడు ప్రారంభించానని గుర్తుచేశారు. 13,40,600 బంగారు కుటు-ంబాలను ఇప్పడు మార్గదర్శులు దత్తతు తీసుకొంటున్నారని తెలిపారు. పీ4లో 15 లక్షలు కుటు-ంబాలను టార్గెట్‌గా పెట్టు-కున్నామని... ఇది మానవతా ధృక్పథంతో చేసే స్వచ్ఛంద కార్యక్రమమని ఉద్ఘాటించారు. పీ4లో చేరాలని ఎవరినీ ఎలాంటి బలవంతం చేయడం లేదని... మీరు ఈ కార్యక్రమంలో పాల్గొంటే మీకు గొప్ప సంతృప్తి కలుగుతుందని చెప్పుకొచ్చారు. 250 కుటుంబాలను తానే దత్తతు తీసుకొని వారిని స్వయంగా మానిటర్ చేస్తున్నానని వివరించారు. ఇకపై ప్రభుత్వ పాలసీలు పేదలకు అనుకూలంగానే ఉంటాయని.. అదే సమయంలో సంపద సృష్టించాలని అన్నారు. ఏమాత్రం మనస్సున్నా పీ4 ఆచరణ సాధ్యమేనని



పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లని ఎన్టీఆర్ అన్నారు. అప్పట్లో వెలుగు అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చాం. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా వెలుగు కార్యక్రమం నడిచింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ నాల్గోస్థానానికి వచ్చింది. రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో మూడో స్థానానికి రానుంది. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. ప్రతీ ఏడాది రైతులకు రూ.20 వేలచొప్పున పెట్టుబడి సహాయం చేస్తున్నాం. కుటు-ంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నాం. ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. గ్యాస్ ధరలు పెరిగాయని మళ్లీ కొందరు క-÷-టటె-ల పొయ్యి వాడారు. అందుకే మహిళల కోసం ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. ఒకప్పుడు ఆడబిడ్డలను చదివించే వారు కాదు. కాలేజీలు, ఉద్యోగాల్లో ఆడబిడ్డలకు రిజర్వేషన్లు కల్పించాం. ఫలితంగా చదువుకునే ఆడవారి సంఖ్య పెరిగింది.

# షఫాలీ వర్మకు దక్కని అవకాశం

## వరల్డ్ కప్ జట్టు ప్రకటించిన బీసీసీఐ

ఈ ఏడాది జరగనున్న మహిళల ప్రపంచకప్ కోసం టీమ్ఇండియా సభ్యుల పేర్లను ప్రకటించింది భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ). స్వదేశంలో జరగనున్న ఈ టోర్నీకి 15 మంది సభ్యులతో కూడిన జట్టును కూర్పు చేసింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా.. స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అయితే ఈ టీమ్‌లో స్టార్ బ్యాటర్ షఫాలీ వర్మకు అవకాశం దక్కకపోవడం గమనార్హం. ఇటీవల ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో షఫాలీ ఇండియా %ూ% జట్టులో భాగమైంది. కానీ ఆమె ఆడిన గత మూడు వన్డే మ్యాచ్‌లతో సహా ఆరు వైట్-బాల్ మ్యాచ్‌లలో పెద్దగా ఆకట్టు కోలేక పోయింది. దీంతో షఫాలీ వర్మను పక్కన పెట్టనట్లు తెలుస్తోంది. అయితే టీమ్ విషయాని కొస్తే.. అంచనాలకు తగ్గట్టుగానే జట్టు కూర్పు జరిగినట్లు తెలుస్తోంది. అందరూ ఆశ్చర్యకరంగా భావించే పెద్దపెద్ద మార్పులేవి జరగలేదు. ఆల్ రౌండర్ అమన్‌జోత్ కౌర్ ప్రస్తుతం గాయపడి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE)లో కోలు కుంటోంది. ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ఆమెను ఎంపిక చేయలేదు. వరల్డ్ కప్ కోసం ఆమె ఫిట్ గా అవుతుందని భావిస్తున్నట్లు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ చెబుతోంది. మహిళల ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన టీమ్ఇండియా జట్టు ఇదే. హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమిమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, అమంజోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), స్నేహ్ రాణా. రిజర్వ్ ప్లేయర్స్: తేజల్ హసబ్నిస్, ప్రేమా రావల్, ప్రియా మిశ్రా, ఉమా చెత్రీ, మిన్ను మణి, సయాలి సత్ఘారే. ప్రపంచ కప్‌తో పాటు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం భారత మహిళా జట్టును కూడా ప్రకటించింది బీసీసీఐ. అయితే ప్రపంచకప్ జట్టుతో పోలిస్తే ఆస్ట్రేలియా సిరీస్‌లో జట్టులో ఒకేఒక్క మార్పు జరిగింది. సయాలి సత్ఘారే ఈ సిరీస్ కోసం జట్టులో చేర్చారు. ఆస్ట్రేలియా సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతీ రెడ్డి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, సయాలీ చారియా సతారే (వికెట్ కీపర్), స్నేహ రానా.



# తిరిగి జట్టులోకి వచ్చిన జస్ప్రీత్ బుమ్రా

## శ్రేయాస్ అయ్యర్‌కు సెలక్టర్లు మొండిచేయి

## వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపిక

## ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

ఆసియా కప్ 2025 టోర్నీకి బీసీసీఐ సెలక్షన్ కమిటీ టీమ్‌ను ప్రకటించింది. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఆసియా కప్ ప్రారంభంకానుంది. టీ20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి ఎంతో ఉత్కంఠ తరువాత టీమ్‌ను ఎంపిక చేశారు. ముంబైలో వాతావరణం సరిగా లేకపోవడంతో టీమ్ ఎంపిక ఆలస్యమైంది. టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు జట్టులో చోటు కల్పిస్తూ.. వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఐపీఎల్‌లో అదరగొట్టిన శ్రేయాస్ అయ్యర్‌కు సెలక్టర్లు షాకిచ్చారు. కచ్చితంగా టీమ్‌లో ఉంటాడని భావించిన యశస్వి జైస్వాల్‌ను కూడా పక్కనపెట్టారు. జైస్వాల్‌ను స్టాండ్ బై ప్లేయరగా ఎంపిక చేశారు. జితేష్ శర్మ రెండో వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో అదరగొట్టిన సిరాజ్ పేరును కూడా పరిగణలోకి తీసుకోలేదు. జైస్వాల్‌తోపాటు ప్రసిద్ధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్‌ను ఎంపిక చేశారు. ఈ టోర్నీ మొదట భారత్ వేదికగా జరగాల్సి ఉంది. అయితే భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతల కారణంగా యుఎఈకి మార్చారు. డిఫెండింగ్ ఛాంపియన్స్ భారత్ సెప్టెంబర్ 10న దుబాయ్‌లో యూఏఈతో పోరుతో ఆసియా కప్ వేట ప్రారంభిస్తుంది. మూడు రోజుల తర్వాత అదే వేదికపై పాకిస్థాన్‌తో తలపడుతుంది. ఆసియా కప్‌కు టీమిండియా జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చకరవర్తి. అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్, హర్షిత్ రాణా, రింకూ సింగ్.



# శ్రేయస్ అయ్యర్ తప్పిదం లేదు అగార్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు



టీమిండియా వెటరన్ బ్యాటర్స్ శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. ఐపీఎల్ 2025లో మెరుగైన ప్రదర్శన చేసినా.. అతనికి అవకాశం ఇవ్వకపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఇదే విషయాన్ని అగార్కర్‌ను ప్రశ్నించగా.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అయ్యర్‌కు భారత టీ20 జట్టులో చోటు లేదని, అతని కోసం ఎవర్నీ తప్పించాలని ప్రశ్నించాడు. ఈ విషయంలో శ్రేయస్ అయ్యర్ తప్పిదం లేదని, తమ తప్పు కూడా లేదన్నాడు. జట్టులోకి 15 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేయగలమన్నాడు. 'శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్‌లు తప్పని పరిస్థితుల్లో జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది. యశస్వి జైస్వాల్ అవకాశం కోసం వేచి చూడటం దురదృష్టకరం. అభిషేక్ శర్మ ఓపెనర్‌గా అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. అంతేకాకుండా అతని వల్ల టీమిండియాకు ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ లభిస్తోంది. శ్రేయస్ అయ్యర్ పరిస్థితి కూడా దురదృష్టకరమే. శ్రేయస్ అయ్యర్ కోసం జట్టులో ఎవర్నీ తప్పించాలి? మీరే చెప్పండి? ఈ విషయంలో శ్రేయస్ అయ్యర్ తప్పిదం లేదు. అదే సమయంలో మా తప్పు కూడా లేదు. మేం కేవలం 15 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుత పరిస్థితుల్లో శ్రేయస్ అయ్యర్ తన అవ కాశం కోసం ఎదురు చూడాల్సిందే.' అని అగార్కర్ చెప్పుకొచ్చాడు. మరోవైపు సంజూ శాంసన్ గురించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'టీ20 జట్టును ఎంపిక చేసేటప్పుడు ఐపీఎల్ ప్రదర్శనలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. కొన్ని టెస్ట్ సిరీస్‌ల కారణంగా.. టీ20ల్లో చాలా మంది ఆటగాళ్లు ఆడాల్సి వచ్చింది. దాంతో టెస్ట్ క్రికెట్ ఆడే ఆటగాళ్ల టీ20 సామర్థ్యం తగ్గినట్లు కాదు. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్‌లు టీ20 ఫార్మాట్‌కు అందుబాటులో లేనప్పుడు సంజూ శాంసన్, అభిషేక్ ఓపెనర్లుగా బరిలోకి దిగారు. అభిషేక్ అద్భుతమైన ప్రదర్శన తనను పక్కన పెట్టలేని పరిస్థితిని తీసుకొచ్చాడు. అంతేకాకుండా అతని ద్వారా టీమిండియాకు అదనపు బౌలింగ్ ఆప్షన్ లభిస్తోంది. టీ20 ప్రపంచకప్ తర్వాత శ్రీలంక వేదికగా జరిగిన టీ20 సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఇప్పుడు అతను అందుబాటులో ఉండటంతో జట్టులోకి తీసుకున్నాం. సెలెక్షన్ కమిటీగా 15 మందిని ఎంపిక చేయడం మా పని. బ్యాటింగ్ లైనప్ ఎంచుకోవడం టీమిండియా మేనేజ్‌మెంట్ తలనొప్పి. టీ20 క్రికెట్‌లో భారత్‌కు చాలా డెప్త్, ఆప్షన్స్ ఉన్నాయి.'అని చెప్పుకొచ్చాడు. అగార్కర్ కామెంట్స్‌ను బట్టి చూస్తే శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడనిపిస్తోంది. అదే జరిగితే సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి.

# సెంచరీతో తొడగొట్టిన పృథ్వీ షా



బీసీసీఐ వద్దని పక్క పెట్టినా.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు మాకొద్దంటూ తప్పించినా.. పృథ్వీ షా మాత్రం క్రికెట్‌లో ఎక్కడో ఒక చోట రాణించాలని కోరుకుంటూనే ఉన్నాడు. తన సత్తా చాటాలని తెగ ఆరాటపడుతున్నాడు. ఇప్పటికే తన సొంత రాష్ట్రం ముంబైను వదిలేసిన షా.. మహారాష్ట్ర తరపున బరిలోకి దిగాడు. అయితే, ఈ మార్పు తనకు కలిసి వచ్చింది. బుచ్చిబాబు ట్రోఫీలో మహారాష్ట్ర తరపున పృథ్వీ షా అద్భుతమైన సెంచరీ సాధించాడు. షా తొలిసారి మహారాష్ట్ర జట్టు తరపున ఒక మ్యాచ్ ఆడాడు. అతను తన తొలి మ్యాచ్‌లోనే అద్భుతాలు చేశాడు. ఛత్తీస్‌గఢ్‌పై షా 111 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో షా 141 బంతులు ఆడాడు. అతని స్ట్రైక్ రేట్ 78 కంటే ఎక్కువగా ఉంది. అతను ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టాడు. క్లిష్ట సమయంలో సెంచరీ చేయడం వల్ల పృథ్వీ షా ఇన్నింగ్స్ కూడా అద్భుతంగా ఉంది. మహారాష్ట్ర జట్టు బ్యాట్స్‌మెన్ పేక మేడల్లా పడిపోతున్నప్పుడు, షా దూకుడుగా బ్యాటింగ్ చేసి ప్రత్యర్థి బౌలర్లను వెనక్కి నెట్టాడు. మహారాష్ట్ర కేవలం 86 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఐదుగురు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌లో నలుగురు 10, 4, 1, 0 మాత్రమే సాధించగలిగారు. రుతురాజ్ గైక్వాడ్ కూడా కేవలం 4 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కానీ, షా దూకుడుగా బ్యాటింగ్ చేయడం ద్వారా మహారాష్ట్రను ఆటలో నిలబెట్టాడు. షా ఔట్ అయినప్పుడు, మహారాష్ట్ర స్కోరు 166 పరుగులు. అందులో అతని సహకారం 111 పరుగులు. పృథ్వీ షా ఇటీవల ముంబై దేశీయ జట్టును విడిచిపెట్టిన సంగతి తెలిసిందే. ఫిట్‌నెస్ సరిగా లేకపోవడంతో అతను రంజీ ట్రోఫీ నుంచి తొలగించబడ్డాడు. ఆ తర్వాత, షా ఒక కీలక నిర్ణయం తీసుకొని మహారాష్ట్ర జట్టులో చేరాడు. మొదటి మ్యాచ్‌లోనే తన క్లాస్‌ని చూపించాడు. పృథ్వీ షా పెద్ద లక్ష్యం టీమ్ ఇండియాకు తిరిగి రావడమే. అతను చాలా కాలంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. అతను అలాంటి ఇన్నింగ్స్‌లు ఆడటం కొనసాగిస్తే, సెలెక్టర్లు అతన్ని మళ్ళీ ఎంపిక చేసుకోవడం తప్పనిసరి అవుతుంది.



# భారత క్రికెట్‌లో కోహ్లీది మరో స్థాయి!

భారత క్రికెట్ చరిత్రలో విరాట్ కోహ్లీ ఒక అసాధారణ వ్యక్తిత్వమని, ఒక అద్భుతమని మాజీ టీమ్?ఇండియా క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసించాడు. విరాట్? కోహ్లీకి నైపుణ్యంతో పాటు, ఫిట్‌నెస్ అదనపు బలమని అతడు కొనియాడాడు. ఈ మేరకు పాడ్?కాస్ట్?లో పలు వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం అవి సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. విరాట్ కోహ్లీ టీమ్ఇండియా కోసం ఎంతో చేశాడు. అతడిలా మరెవ్వరూ చేయలేదు. భారత జట్టు రాబోయే వందేళ్లలో ఆధిపత్యం చెలాయించేలా బాటలు వేశాడు. అతడికి ఎంతో నైపుణ్యం ఉంది. దాంతోపాటు చక్కటి ఫిట్‌నెస్ అతడి సొంతం. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే మానసికంగా కూడా బలంగా తయారవుతారు. ఇది క్రికెట్‌కు ఎంతో అవసరం. కోహ్లీ కేవలం మంచి బ్యాటర్ మాత్రమే కాదు. ఫిట్‌నెస్ విషయంలో అతడో మార్గదర్శి. అతడి వల్లే ఫిట్‌నెస్‌లో భారత జట్టు అత్యున్నత ప్రమాణాలను అందుకుంది. టాలెంట్ ఉన్న ప్రతి ఆటగాడికి ఫిట్‌నెస్‌ను జోడించడం ద్వారా టీమ్? ఇండియా నాణ్యత మరింత మెరుగైంది" అని అన్నాడు. కోహ్లీని ప్రశంసించిన రాయుడు, అతని టెస్టు రిటైర్మెంట్‌పై మాత్రం నిరాశ వ్యక్తం చేశాడు. "నా అభిప్రాయం ప్రకారం కోహ్లీ రిటైర్మెంట్ తీసుకోవడం చాలా తొందరపాటు నిర్ణయం. అతడు కచ్చితంగా ఇంకా ఆడాల్సింది. ముఖ్యంగా ఇంగ్లాండ్ సిరీస్‌లో అతడు ఉండాల్సింది. ఇంకా చాలా మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, ఫిట్‌నెస్ పరంగా చూసుకుంటే టీమ్? ఇండియాలో సగం మంది ఆటగాళ్లు కూడా అతడంత ఫిట్‌గా లేరు" అని రాయుడు తెలిపాడు. అదే సమయంలో, కోహ్లీ వ్యక్తిగత ఆనందమే తాను కూడా కోరుకుంటున్నానని తెలిపాడు. "కొన్నిసార్లు ప్రజలు భావిస్తారు, వందల సెంచరీలు కొట్టాడని, కోట్ల రూపాయలు సంపాదించాడని అందుకే సంతోషంగా ఉంటాడని. కానీ నిజంగా మనసారా సంతోషంగా ఉండటం వేరే విషయం.



# ప్రసిధ్ కృష్ణ విషయంలో నిర్ణయాలు కరెక్ట్ కాదు

## గంభీర్, మోర్కెల్ పై భరత్ అరుణ్ సీరియస్

టీమ్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ , బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ పై టీమిండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ సీరియస్ అయ్యాడు. ఇంగ్లాండ్ సిరీస్‌లో పేసర్ ప్రసిధ్ కృష్ణ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలు కరెక్ట్ కాదని విమర్శించాడు. ప్రసిధ్ కృష్ణ తన బౌలింగ్ లెంగ్త్‌ను మార్చుకుని, బాగా బౌలింగ్ చేస్తున్న టైమ్‌లోనే అతన్ని పక్కనపెట్టేశారని అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయంతో అతని రిథమ్ పోయిందని, గ్రోత్ ఆగిపోయిందని భరత్ అరుణ్ అసహనం వ్యక్తం చేశాడు. ఇంగ్లాండ్‌తో ఆడిన అండర్సన్- టెండూల్కర్ సిరీస్‌లో ప్రసిధ్ ఐదు టెస్టుల్లో మూడింటిలో ఆడి 14 వికెట్లు తీశాడు. కానీ, స్టార్టింగ్ మాత్రం చాలా టఫ్‌గా సాగింది. హెడింగ్లీలో జరిగిన ఫస్ట్ టెస్టులో, ప్రసిధ్ ఎక్కువగా షార్ట్ బాల్స్ వేసి, ఓవర్‌కు ఐదుకు పైగా రన్స్ ఇచ్చేశాడు. ఆ మ్యాచ్ ఇండియా ఓడిపోయింది. ఆ మ్యాచ్ తర్వాత, ఇంగ్లాండ్ కండిషన్స్‌లో గుడ్-లెంగ్త్ బాల్స్ వేయాలని అతనికి క్లియర్‌గా చెప్పినట్టు అరుణ్ గుర్తుచేశాడు. షాకింగ్ విషయం ఏంటంటే, నెక్స్ట్ మ్యాచ్‌లోనే ప్రసిధ్ తన లెంగ్త్‌ను మార్చుకుని, కంట్రోల్‌తో బౌలింగ్ చేయడం స్టార్ట్ చేశాడు. సరిగ్గా అదే టైమ్‌లో అతన్ని డ్రాప్ చేశారు. బుమ్రా టీమ్‌లోకి రీ-ఎంట్రీ ఇచ్చినప్పుడు, ఎవరో ఒకరు తప్పుకోవాల్సిందేనని అరుణ్ ఒప్పుకున్నాడు. కానీ, లార్డ్స్‌లో తీసుకున్న నిర్ణయమే అతనికి నచ్చలేదు. అప్పుడప్పుడే ఫామ్ అందుకుంటున్న ప్రసిధ్ కృష్ణను పక్కనపెట్టి, డెబ్యూ ప్లేయర్ అన్షుల్ కంబోజ్‌ను టీమ్‌లోకి తీసుకున్నారు. ఆ టెస్టులో ఇండియా 22 రన్స్‌తో ఓడిపోయింది. గంటకు 140 కి.మీ స్పీడ్‌తో బౌలింగ్ చేసే ఒక బౌలర్, కరెక్ట్ లెంగ్త్ అందుకున్నప్పుడు, అతన్ని ఎంకరేజ్ చేయాలి గానీ, బెంచ్‌కి పరిమితం చేయడం ఏంటని అరుణ్ క్వశ్చన్ చేశాడు."మీరు గేమ్‌కు కాదు, ప్లేయర్‌కు, అతని మైండ్‌సెట్‌కు కోచింగ్ ఇవ్వాలి" అని అరుణ్ స్ట్రాంగ్‌గా చెప్పాడు. ఒక ఫాస్ట్ బౌలర్‌కు పిచ్, కండిషన్స్ ఎలా ఉన్నాయో అర్థమయ్యాక, అతనికి బ్యాకప్‌గా ఉండాలి. ముఖ్యంగా, ఒక మిస్టేక్‌ను సరిదిద్దుకున్నాక అతన్ని టీమ్ నుంచి తీసేస్తే, అది అతని కాన్ఫిడెన్స్‌ను దెబ్బతీయడమే కాకుండా, లెర్నింగ్ కర్వ్‌ను కూడా పాడు చేస్తుందని అరుణ్ చెప్పుకొచ్చాడు. సిరీస్ డిసైడ్ చేసే ఓవల్ టెస్టులో ప్రసిధ్‌ను మళ్లీ టీమ్‌లోకి తీసుకోగా, ఆ మ్యాచ్‌లో అతను చెలరేగిపోయాడు. మ్యాచ్ మొత్తంలో 8 వికెట్లు పడగొట్టి, సిరాజ్‌తో కలిసి ఇంగ్లాండ్ బ్యాటింగ్‌ను కుప్ప కూల్చేశాడు. ఈ పెర్ఫార్మెన్స్‌తో ఇండియా సెన్సేషనల్ విక్టరీ కొట్టి సిరీస్‌ను లెవెల్ చేసింది. దీంతో, అరుణ్ చెప్పిన



## ఏఐ ఆధారిత హనుమాన్ మూవీ భారీ ఎత్తున నిర్మించేందుకు సన్నాహాలు

ఇప్పుడంతా పురాణాల కాలం నడుస్తోంది. పురాణాల ఆధారంగా చిత్రాలకు ఆదరణ పెరుగుతోంది. అలాగేప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం బాగా పెరుగుతోంది. –టెక్నాలజీ రంగం నుంచి హెల్త్, ఎడ్యుకేషన్, బిజినెస్, ఎంటర్‌టెయిన్‌మెంట్ తో పాటు–.. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో ఏఐకి డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోంది. కథలు రాయడం నుంచి విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ సన్నివేశాల వరకు ఏఐ ద్వారా సులభతరం అవుతుంది. ఇప్పటికే కొన్ని షార్ట్ ఫిల్మ్స్, యానిమేటెడ్ క్లిప్స్ మాత్రమే ప్రేక్షకుల ముందుకు రాగా, ఇప్పుడు బాలీవుడ్ నుంచి ఒక భారీ పూర్తి స్థాయి ఏఐ సినిమా రాబోతోందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం 'చిరంజీవి హనుమాన్'. పురాణాల్లో అత్యంత శక్తివంతమైన దేవుడిగా, భక్తుడిగా పేరుగాంచిన హనుమంతుని శౌర్యం, భక్తి, అద్భుత గాథను ఏఐ ఆధారిత యానిమేషన్ శైలిలో చూపించబోతున్నారు. ఇది సాధారణ మిథాలజీ సినిమా కాదు, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన స్పెషల్ ప్రాజెక్ట్. హనుమంతుని ధైర్యం, భక్తి, సాహసాలను ఇప్పటివరకు స్క్రీన్‌పై చూడని విధంగా చూపించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ని ప్రారంభించారట. ఈ ప్రాజెక్ట్‌ని బాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు విక్రమ్ మల్హోత్రా, విజయ్ సుబ్రహ్మణ్యం సంయుక్తంగా నిర్మిస్తుండగా, విజువల్స్, గ్రాఫిక్స్, యాక్షన్ సన్నివేశాలను.. అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్లతో కలసి, ఏఐ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి, హనుమంతుని వ్యక్తిత్వాన్ని కొత్త కోణంలో చూపించబోతున్నారని టీమ్ వెల్లడించింది. ఇందులో భాగంగా ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అంతే కాదు ఈ చిత్రం వచ్చే ఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## కమల్, రజనీలతో లోకేశ్ మల్టీస్టారర్ మూవీ

కూలీ సినిమాతో సూపర్ హిట్‌ని అందుకున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు– తెలుస్తుంది. ఇప్పటికే నటుడు కార్తీతో ఖైదీ 2 సినిమాను లైన్‌లో పెట్టిన లోకేష్.. ఈ సినిమా కంటే ముందే మరో బిగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించబోతున్నాడని సమాచారం. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్‌లతో కలిసి కలిసి లోకేష్ ఒక భారీ మల్టీస్టారర్ చేయబోతున్నట్లు– కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇద్దరు వయసు మళ్లిన గ్యాంగ్‌స్టర్ల కథ అని తెలుస్తుంది. ఇద్దరు లెజెండరీ నటుల ఇమేజ్‌కు తగ్గట్టుగా లోకేష్ కనగరాజ్ ఈ కథను సిద్ధం చేశాడని.. ఈ కథకు ఇద్దరు హీరోలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రాన్ని కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ అయిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనుందని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రకటన రాబోతుంది.




## 'కాంత'పై కన్నులెన్నో.. భాగ్యశ్రీ దశ తిరిగేనా?



### భాగ్యశ్రీ బోర్సే కి విపరీతమైన క్రేజ్
### ఇంతవరకూ దక్కని హిట్
### 'కాంత'పైనే అన్ని ఆశలు
### సెప్టెంబర్ 12వ తేదీన రిలీజ్
### 1950లలో నడిచే కథా నేపథ్యం

తెలుగు తెరకు ఈ మధ్య కాలంలో పరిచయమైన అందాల నాయిక భాగ్యశ్రీ బోర్సే. ముందుగా బాలీవుడ్ వైపు నుంచి ఎంట్రీ ఇచ్చినప్పటికీ, తెలుగు ఇండస్ట్రీకి రావడానికి పెద్దగా సమయం తీసుకోలేదు. తెలుగులో ఆమె చేసిన 'మిస్టర్ బచ్చన్' అంతగా ఆడలేదు. ఆ సినిమా కథను మరిచిపోయినంత తేలికగా ప్రేక్షకులు ఆమె గ్లామర్ ను మరచిపోలేకపోయారు. ఆమెకి గల ఆ క్రేజ్ కారణంగానే 'కింగ్ డమ్'లో ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా హిట్ అయితే భాగ్యశ్రీ ఎక్కడికో వెళ్లిపోతుందని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. నిజానికి తెలుగు ఇండస్ట్రీలోకి సరైన సమయంలో భాగ్యశ్రీ ఎంట్రీ ఇచ్చింది. ఎందుకంటే ఇప్పుడు ఇక్కడ హీరోయిన్స్ వైపు నుంచి పెద్దగా పోటీలేదు. పూజ హెగ్డే .. రష్మిక .. కీర్తి సురేశ్ జోరు లేదు. కెరియర్ పరంగా శ్రీలీల ఇంకా తడబడుతూనే ఉంది. ఈ సమయంలో భాగ్యశ్రీ గ్లామర్ కి హిట్ తోడైతే బాగానే ఉండేది కానీ, అందుకు ఆమె చాలా దూరంలోనే ఉంది. అయితే 'కాంత' సినిమాతో ఆమె దశ తిరిగిపోవడం ఖాయమనే టాక్ బలంగా వినిపిస్తోంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆమె దుల్కర్ సల్మాన్ జోడీగా కనిపించనుంది. తమిళంతో పాటు ఈ సినిమా తెలుగు .. కన్నడ భాషల్లోను విడుదల కానుంది. తమిళ .. కన్నడ భాషా ప్రేక్షకులకు ఆమె పరిచయమవుతున్న సినిమా ఇదే. 1950 కాలం నాటి కథా నేపథ్యంలో .. మద్రాస్ వేదికగా ఈ సినిమా నడుస్తుంది. 'కాంత'లో భాగ్యశ్రీకి గ్లామర్ తో పాటు నటనకి స్కోప్ ఉన్న పాత్ర దక్కింది. అందువలన ఈ సినిమాతో ఆమె కెరియర్ పుంజుకోవడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. సెప్టెంబర్ 12వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది.

## దురుంధర్ మూవీ షూట్‌లో ఫుడ్ పాయిజనింగ్




బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న ధురంధర్ మూవీ సెట్స్‌లో అపశృతి చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తిని దాదాపు 120 మందికి పైగా సినీ కార్మికులు అస్వస్థత గురయ్యారు. దీంతో వీరిని ఆసుపత్రికి తరలించగా.. కార్మికులందరి ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు– అధికారులు చెప్పారు. ధురంధర్ మూవీ షూటింగ్ కోసం వీరందరూ లేహ్‌కి వచ్చినట్లు తెలుస్తుంది. ఇక ఈ ఘటన జరిగిన ప్రదేశం నుంచి ఆహార శ్యాంపిళ్లను విశ్లేషణ కోసం సేకరించారు. ఫుడ్ పాయిజనింగ్ జరిగినట్లు– ఆస్పత్రి డాక్టర్లు చెబుతున్నారు. రణ్‌వీర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ధురంధర్'. ఈ సినిమాకు నేషనల్ అవార్డు విన్నర్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఉరి: ది సర్జికల్ ÷–టస్ట్రైక్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్న రెండవ చిత్రం ఇది. ఈ చిత్రం 2025 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుండగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.

## సందేశ సినిమాల్లో నారాయణమూర్తిదే పైచేయి

### నటుడు బ్రహ్మానందం కితాబు



ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యూనివర్సిటీ– పేపర్ లీక్'. ఇది ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో టీమ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్.నారాయణమూర్తితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈరోజు మన దేశ విద్యావ్యవస్థ మారిపోయింది. అది ఎలా ఉంది అనే అంశంపై తమ్ముడు నారాయణమూర్తి రూపొందించిన గొప్ప చిత్రమిది. నాకు ఆయన 40 సంవత్సరాలుగా తెలుసు. నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తారు. ఈ సినిమా కూడా పేద ప్రజల కోసమే తీశారని అన్నారు. నారాయణమూర్తి ఎన్నో త్యాగాలు చేశారు. ఆయన జీవితం మీకు అంకితం. చివరిశ్వాస వరకూ మీకోసం కష్టపడుతూనే ఉండాలని కోరుకుంటున్నాను. ఇది ఎంతో అందమైన సినిమా. ఇందులో నిజాలుంటాయి.. బూతులు ఉండవు, జీవితపు లోతులుంటాయి. 'పెద్ద వాళ్లకు కావాలంటే నాలో అమ్మడానికి చాలా ఉన్నాయి.. కిడ్నీ కూడా ఉంది' అంటూ సాగే కొన్ని డైలాగులు వింటే హృదయం కదిలిపోయింది. ఈ సినిమాను అందరూ చూడాలి. అర్థం చేసుకోవాలి. సమాజం బరువు మోసే వ్యక్తి నారాయణమూర్తి. ఆయన ఒక శక్తి అన్నారు. నారాయణమూర్తి చేసినన్ని మంచి పనులు నేను చేయలేదు.

## థామా హారర్ మూవీలో రష్మిక

స్త్రీ' 'భేదియా', 'ముంజ్యా' లాంటి హారర్ కామెడీ చిత్రాలను తెరకెక్కించిన బాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ మాడ్‌డాక్ ఫిలిమ్స్ మరో క్రేజీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ హారర్ యూనివర్స్‌లో రాబోతున్న తాజా చిత్రం 'థామా'. ఈ సినిమాకు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తుండగా.. నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా ప్రధనా పాత్రల్లో నటిస్తున్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ విలన్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూ స్తుంటే.. అతీంద్రియ శక్తులతో కూడిన ఓ రొమాంటిక్ చిత్రంగా రాబో తున్నట్లు– తెలుస్తుంది. ఇక ఈ చిత్రంలో రష్మిక తడకా పాత్రలో కనిపించ బోతుండగా.. ఆయుష్మాన్ ఖురానా అలోక్‌గా, నవాజుద్దీన్ సిద్ధిఖీ యక్షసాన్‌గా, పరేశ్ రావల్ రామ్ బజాజ్ గోయెల్‌గా కనిపించబోతున్నారు.






## థగ్ లైఫ్ ఫలితం.. నాన్నను దెబ్బతీయదు

### నటి శృతి హాసన్ కామెంట్స్

అగ్ర హీరోల సినిమాల్లో నటిస్తూ శ్రుతిహాసన్ హిట్‌లను సొంతం చేసుకుంటున్నారు. తాజాగా 'కూలీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించి ఆకట్టుకున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం విజయాన్ని అందుకుంది. ఈసందర్భంగా హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రుతి తన తండ్రి కమల్‌హాసన్ గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రభావం తనపై ఎంతో ఉందన్నారు. నేను కమల్ హాసన్ కుమార్తెగా పరిచయమయ్యాను. కాబట్టి నాపై ఆయన ప్రభావం చాలా ఉంటుంది. నా నటనను ఆయన యాక్టింగ్‌తో పోలుస్తుంటారు. కానీ దానివల్ల నేనెప్పుడూ ఇబ్బంది పడలేదు. ఆయన ఎప్పుడూ నావెంట ఉండడం నా అదృష్టంగా భావిస్తాను. ఇండస్ట్రీలోని ఎంతోమందిలో ఆయన స్ఫూర్తి నింపారు. నాన్న నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఎంత ఎదిగినా ఒదిగిఉండాలని ఆయన దగ్గర నుంచే నేర్చుకున్నాను' అని తెలిపారు. ఇక కమల్ హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' మిశ్రమ ఫలితాలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై శ్రుతిహాసన్ మాట్లాడుతూ.. బాక్సాఫీస్ నంబర్లు కమల్‌హాసన్‌ను ప్రభావితం చేయలేవని తెలిపారు. 'పదేళ్ల క్రితం ఇండస్ట్రీలో ఈ నంబర్ల ప్రస్తావన ఉండేది కాదు. మా నాన్న తన సొంత డబ్బు పెట్టి సినిమా తీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆయనది నంబర్ల గురించి ఆలోచించే మనస్తత్వం కాదు. వాటి గురించి పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటారు' అని శ్రుతి హాసన్ వివరించారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685